


వైద్యారోగ్యశాఖలో ముఖహాజరు (ఎఫ్ఆర్ఎస్) మాయాజాలం కలకలం రేపుతోంది. వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బంది వైద్యశాలలకు సకాలంలో చేరుకుని ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతున్నట్లు వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఉదయం, సాయంత్రం సమయంలో తప్పనిసరిగా ఉద్యోగులు ముఖహాజరు వేస్తున్నారే తప్ప విధులకు మాత్రం ఎగనామం పెడుతున్నట్లు తేలింది. అలాంటివారు జిల్లావ్యాప్తంగా 330మందికిపైగా ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు సమాచారం. అటువంటి వ్యవహారాలను అడ్డుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉన్నతాధికారులు మరింత విస్తరించినట్లు తెలిసింది.

ముఖహాజరు మాయాజాలం
విధులకు ఎగనామం

ఐఫోన్‌తో హాజరును ట్యాంపరింగ్ చేసిన మెడికల్ ఆఫీసర్లపై చర్యలకు రంగం సిద్ధం

- ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 330 మందికిపైగా వైద్యాధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు
- కలకలం రేపుతున్న వ్యవహారం
- కార్యస్థానంలో హాజరు వేసి వెళ్లిపోతున్న సిబ్బందిని గుర్తించిన ఉన్నతాధికారులు
- యాప్ సరిగా పనిచేయడం లేదంటూ వివరణ ఇస్తున్న పరిస్థితి
- ఐఫోన్లతో ట్యాంపరింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు వైద్యారోగ్యశాఖ చర్యలు



ఒంగోలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది ముఖ హాజరు (ఎఫ్ఆర్ఎస్)లో చోటుచేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా మెడికల్ ఆఫీసర్లు, వైద్యాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పనిచేసే చోట ముఖ ఆధారిత గుర్తింపు యాప్ (ఎఫ్ఆర్ఎస్)ను అందుబాటులోకి తెచ్చింది. దాని ద్వారా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ముఖహాజరు వేయాల్సి ఉంది. ఆ ఎఫ్ఆర్ఎస్ కూడా ఎక్కడ వేసింది కూడా తెలిసే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. అయితే ప్రస్తుతం ఎక్కువ మంది ఐఫోన్లను వినియోగిస్తుండటం, ఆ యాప్ అందులో పనిచేయకపోవడం కలిసొచ్చింది. ఆ యాప్ కేవలం ఆండ్రాయిడ్ ఫోన్లలో మాత్రమే పనిచేస్తుంది.

యాప్ సరిగా లేదు

తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు ముఖహాజరు వేసే యాప్‌లు సరిగా పనిచేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని వివరణలు ఇస్తున్నట్లు సమాచారం. కాగా విధులకు సకాలంలో హాజరుకానటువంటి వైద్యాధికారులు, సిబ్బందిని కూడా వైద్యశాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా 25 మంది వైద్యాధికారులు సకాలంలో విధులకు హాజరుకానట్లు గుర్తించి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. 96 మంది వైద్యాధికారులు డ్యూటీకి సక్రమంగా చేయనట్లుగా గుర్తించి వారికి కూడా నోటీసులు జారీచేశారు. మరోవైపు పారా మెడికల్ సిబ్బంది కూడా సుమారు 220 మందికిపైగా ముఖ హాజరును లేటుగా వేయడంతోపాటు గైర్హాజరైనట్లు సమాచారం. ఇలాంటి వారికి అడ్డుకట్ట వేసేందుకు వైద్యారోగశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు సమాచారం.

ఐఫోన్ల ద్వారా ట్యాంపరింగ్

ఆండ్రాయిడ్ ఫోన్లు కాకుండా ఎక్కువమంది ఐఫోన్లు వాడటం ద్వారా ముఖహాజరును ట్యాంపరింగ్ చేశారు. ఈ వ్యవహారాన్ని రాష్ట్రస్థాయిలో అధికారులు గుర్తించడంతో కలకలం రేగింది. పనిచేసే వైద్యశాలకు ఎప్పుడు వెళ్లినా సరే ఐఫోన్‌లో ఎంత సమయం పెట్టుకుంటే ఆ సమయంలోనే విధుల్లో పాల్గొన్నట్లు చూపిస్తుంది. అలాగే ఇంతకాలం కొందరు హాజరు వేస్తూ విధులకు మాత్రం డుమ్మా కొడుతున్నారు. దీన్ని గుర్తించిన ఉన్నతాధికారులు ఎఫ్ఆర్ఎస్ మాయాజాలం చేసిన వారికి షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చారు. ఐఫోన్ల ద్వారా జిల్లాలో 16 మంది మెడికల్ ఆఫీసర్లు ముఖ హాజరును ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించారు. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీచేసిన ఉన్నతాధికారులు అందుకు సంబంధించి వివరణలు ఇవ్వాలని ఆదేశించారు.

ఆట కట్టించేందుకు ఏర్పాట్లు

ప్రస్తుతం వైద్యశాఖ అందుబాటులోకి తెచ్చిన సాంకేతిక పరిజ్ఞానం హాజరు వేసిన తర్వాత వైద్యశాలలో ఉంటున్నారా.. లేదా? అనేది తెలుసుకునేందుకు వీలుగా రూపొందించినట్లు తెలిసింది. దానివల్ల వైద్యశాఖలో పనిచేసే ఉద్యోగుల ముఖహాజరు మాయాజాలాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో అందరిలో అలజడి రేగింది. మరో వైపు వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు కూడా ఉదయం ముఖహాజరు వేసి కార్యాలయంలో ఉండకుండా వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



ఒంగోలులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమావేశమైన మూడు జిల్లాల అధికారులు

క్షేత్రస్థాయి వ్యవసాయ అనుబంధ
సిబ్బంది సర్దుబాటు

- సచివాలయం యూనిట్‌గా నియామకంపై కసరత్తు
- ఒంగోలులో మూడు జిల్లాల అధికారుల భేటీ

ఒంగోలు మే 3 (ఆంధ్రజ్యోతి): సచివాలయ పునర్‌వ్యవస్థీకరణ నేపథ్యంలో వ్యవసాయ అనుబంధ శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది నియామకాలపై సంబంధిత అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నియామకాలు జరిగి ఉండటంతో ఆవిధంగానే ప్రస్తుతం సిబ్బందిని సర్దుబాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. అందులో వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్ శాఖలు సంయుక్తంగా ఈ ప్రక్రియను నిర్వహించాల్సి ఉంది. సచివాలయం యూనిట్‌గా తీసుకొని ఆ పరిధిలో ఏ పంట సాగు అధికంగా ఉంటుందో ఆ శాఖ (అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్) సిబ్బంది అక్కడ ఉండేలా నియమించనున్నారు. ఇందుకు సంబంధించి శనివారం ఒంగోలులోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్ అధికారుల సంయుక్త సమావేశం జరిగింది. జిల్లా నుంచి వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఏడీ గోపీచంద్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ బ్రహ్మయ్యలతోపాటు పొరుగు జిల్లాల ద్వితీయశ్రేణి అధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో 2024-25 సాగు సమయంలో ఖరీఫ్, రబీ సీజన్లలో ఈ క్రాప్ నమోదు ప్రకారం అధిక విస్తీర్ణం ఏపంట సాగైందో చూసి సచివాలయాల సంఖ్య ప్రకారం సగటున ఒక్కో దాని పరిధిలో ఎంత విస్తీర్ణం వస్తుందన్నది గుర్తిస్తున్నారు. అందులో ఏ శాఖ విస్తీర్ణం అధికంగా ఉంటే ఆ శాఖకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బందిని నియమించ నున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో సుమారు ఏడు లక్షల ఎకరాల విస్తీర్ణం ఈ క్రాప్ నమోదైంది. వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్ శాఖల పరిధిలో పంటలు సాగయ్యాయి. మొత్తం 906 రైతు సేవా కేంద్రాలు(సచివాలయానికి ఒకటి) ఉమ్మడి జిల్లాలో ఉండగా మూడు శాఖల పరిధిలో 871 మంది సిబ్బంది ఉన్నారు. వారిని మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా సచివాలయాల్లో నియమించనున్నారు. కొన్నింటిలో సగటు విస్తీర్ణం కన్నా అధికంగా ఉంటే గతంలో ఆయా శాఖల్లో ఉన్న ఎంపీఈవోలను వాటికి బాధ్యులుగా నియమిస్తారు. రెండు రోజుల్లో ఈ కసరత్తు పూర్తవుతుందని డీఏవో శ్రీనివాసరావు తెలిపారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు

నేడు సింగరాయకొండలో సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

- హాజరుకానున్న హైకోర్టు న్యాయమూర్తులు

సింగరాయకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ మండల కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మించిన భవనంలో సివిల్ జడ్జి కోర్టు ఆదివారం ప్రారంభం కానుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ టి.రాజశేఖర్‌రావు, హైకోర్టు న్యాయమూర్తులు డాక్టర్ కుంభజడల మన్మథరావు, జి.రామకృష్ణప్రసాద్, డాక్టర్ వై.లక్ష్మణరావు, జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి హాజరవుతారని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు తెలిపారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- ఎంపీడీవోలు, ఏపీవోలు జవాబుదారీతనంగా ఉండాలి
- కలెక్టర్ అన్సారియా ఆదేశం

వివరాలు 3వ పేజీలో

కిడ్నాప్‌నకు గురైన చిన్నారి క్షేమం

- కేసును ఛేదించిన పోలీసులు
- అపహరించింది లింగసముద్రం మండలం ఎర్రారెడ్డిపాలెం వాసి
- బాలిక నాయనమ్మను మద్యం మత్తులో ఉంచి ఎత్తుకెళ్లిన వైనం
- వలేటివారిపాలెంలోని నిందితుడి తల్లిదండ్రుల వద్ద పాప
- అమ్మానాన్నలకు అప్పగించిన ఎస్పీ

3



చిన్నారి ఐశ్వర్యను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్పీ దామోదర్

వీరయ్యచౌదరి హత్యకు
పక్కా పథకం

- రెండు నెలలుగా నిందితులు ఒంగోలులోనే మకాం
- అంతా ఇసుక వ్యాపారి వ్యూహం ప్రకారమే

ఒంగోలు క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): కిరాయి హంతకులను వినియోగించి పక్కా పథకం ప్రకారం టీడీపీ నేత వీరయ్యచౌదరిని హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఇసుక వ్యాపారి నెలరోజుల ముందుగానే మహారాష్ట్రలోని బలార్షాలో ఇల్లు అద్దెకు తీసుకున్నట్లు తెలుస్తోంది. హత్య జరిగే సమయంలో ఇసుక వ్యాపారి.. వీరయ్యచౌదరి కార్యాలయం ఎదురుగా కారు పార్కు చేసుకొని హంతకులకు సూచనలు ఇచ్చినట్లు సమాచారం. హత్యకు ముందు వీరయ్య తన కార్యాలయంలో కూర్చొని ఉన్న ఫొటో దుండగులకు చేరినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ఫొటో హంతక ముఠాకు ఎలా చేరింది అనే కోణంలో విచారణ చేస్తున్నారు. కిరాయి హంతకులకు నేరచరిత్ర ఉండటంతో వారికి అనేక రకాలుగా ఇసుక వ్యాపారి సహకరించి హత్య చేసేందుకు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. హత్యలో పాల్గొన్న హంతకులు పొరుగు జిల్లాలో నివాసం ఉంటున్న గృహాలను హత్యకు ముందు రెండురోజుల క్రితం ఖాళీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.



వీరయ్య చౌదరి హత్యకు గురైన భవనం

వీరయ్య హత్య తర్వాతే ఇసుక వ్యాపారి పరారీ

హంతకులు ఇద్దరూ రెండు నెలల ముందు నుంచే ఒంగోలులో మకాం వేశారు. ఎప్పటికప్పుడు వీరయ్యచౌదరి కదలికలను గమనిస్తూ ఉన్నారని తెలిసింది. హత్య చేసిన తరువాత ఎటు వైపు పరారవ్వాలన్న అంశాన్ని స్పష్టంగా నిర్ధారించుకున్నారు. హత్యకు వారంరోజులు ముందుగా వారికి మరో ఇద్దరు తోడయ్యారు. ముందుగా రచించుకున్న పక్కా పథకాన్ని ఇసుక వ్యాపారి అమలు చేశారు. వీరయ్య చౌదరి మృతిచెందిన తర్వాతనే అతను ఒంగోలు నుంచి పరారైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.



తప్పులతడక

- సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు
- భగ్గుమన్న ఉపాధ్యాయ సంఘాలు
- సరిచేస్తామన్న డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలువిద్య, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలు తప్పులతడకగా ఉండటంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు భగ్గుమన్నారు. స్థానిక సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం డీఈవో కిరణ్‌కుమార్ ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు. అందులో టీచర్ల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలు, 117 జీవోకు ప్రత్యామ్నాయంగా పాఠశాలల పునర్విభజన, ఉపాధ్యాయుల కేటాయింపుపై చర్చించారు. మొదటగా ఉద్యోగోన్నతులకు సంబంధించిన టీచర్ల సీనియారిటీ జాబితాలోని తప్పులపై డీఈవోను ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రశ్నించారు. నెల రోజులుగా ప్రక్రియ కొనసాగుతున్నా తప్పులు లేకుండా జాబితాలను ప్రకటించలేకపోయారని ఆక్షేపించారు. స్కూలు అసిస్టెంట్లను హెచ్ఎం ప్రమోషన్లకు తయారుచేసిన జాబితాపై అభ్యంతరాలు తెలిపారు. డీఎస్సీ 1994 పేర్ల మధ్య డీఎస్సీ 96 పేర్లను చేర్చడం ఏమిటని ప్రశ్నించారు. మార్కాపురం మునిసిపాలిటీలోని సోషల్ స్టడీస్ స్కూలు అసిస్టెంట్ సీనియారిటీ జాబితాలో అసంబద్ధాలను నాయకులు డీఈవో దృష్టికి తెచ్చారు. 2009లో స్కూలు అసిస్టెంట్ ఇంగ్లీషు ప్రమోషన్ పొందిన టీచర్ల సీనియారిటీ జాబితాలోని లోపాలను కూడా ప్రస్తావించారు. దీనిపై డీఈవో స్పందిస్తూ జాబితాల్లోని తప్పులన్నింటినీ సరిచేస్తామని, సీనియారిటీ విషయంలో వివాదం ఉన్న విషయాలపై పాఠశాల విద్యా కమిషనర్ నుంచి వివరణ తీసుకొని జాబితాలను పారదర్శకంగా రూపొందిస్తామని హామీ ఇచ్చారు.


వైద్య ధ్రువీకరణ పత్రాలకు మరో అవకాశం ఇవ్వాలి

టీచర్ల బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీలో బదిలీ పొందేందుకు వైద్య ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు మరో అవకాశం ఇవ్వాలని డీఈవోను ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఉర్దూ మీడియం పాఠశాలల విషయంలో విద్యార్థులకు అన్యాయం జరగకుండా టీచర్లను కేటాయించాలని కోరారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీలు ఉదయ భాస్కర్, వరప్రసాద్, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, షేక్‌అబ్దుల్, లక్ష్మీనారాయణ, ఏపీటీఎఫ్ నాయకులు జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు, వీవీ సుబ్బారావు, పీఆర్‌టీయూ నాయకులు పులి శ్రీనివాసరావు, ఎస్‌టీయూ నాయకులు చల్లా శ్రీనివాసులు, నరసింహారెడ్డి, టీఎన్‌యూఎస్ నుంచి ఆంజనేయులు, బీటీఏ నుంచి వెంకట్రావు, పండిట్ పరిషత్ నుంచి రఘు తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగున 74,530 కుటుంబాలు

- పీ4 సర్వేలో గుర్తింపు
- ప్రభుత్వం నుంచి గ్రామాలవారీగా జిల్లా అధికారులకు జాబితా
- బంగారు కుటుంబాలుగా ప్రకటించి ఆర్థికాభివృద్ధి చర్యలకు ఆదేశం

ఒంగోలు మే 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పీ4 సర్వేలో అట్టడుగు స్థాయిలో జిల్లాలోని 74,530 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. వాటి ఆర్థికాభివృద్ధికి దాతల సాయంతో జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉంది. పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విదితమే. వివిధ సామాజిక, ఆర్థిక అంశాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా సచివాలయం యూనిట్‌గా పీ4 సర్వేను నిర్వహించింది. అందులో మొత్తం 27 అంశాలపై ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి వాటి ఆధారంగా ఆ కుటుంబాల ఆర్థిక స్థితిగతులను అంచనా వేశారు. అందులో అట్టడుగు స్థాయిలో ఉన్న 20శాతం కుటుంబాలను పీ4 కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఉగాది పర్వదినం రోజున అమరావతిలో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ప్రారంభించారు. పేదరికంలో అట్టడుగున ఉన్న కుటుంబాల అభివృద్ధి లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులైన పేద కుటుంబాలను బంగారు కుటుంబంగా, అందుకు సహకరించే దాతలను మార్గదర్శిగా నామకరణం చేశారు.



వచ్చే ఉగాదికి పూర్తి

ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి ఒకస్థాయికి ఈ కార్యక్రమాన్ని చేర్చి వచ్చే ఏడాది ఉగాది నాటికి పూర్తిస్థాయి ఫలితాలు అందేలా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. పీ4 సర్వే ఆధారంగా ఆయా జిల్లా, మండలం, సచివాలయం వారీగా పేదరికంలో అట్టడుగున ఉన్న కుటుంబాల జాబితాలను ప్రకటించింది. ఆ ప్రకారం జిల్లాలో 74,530 కుటుంబాలను పీ4 కార్యక్రమం కింద ఆర్థికంగా అభివృద్ధి చేయాలి. అందుకు సంబంధించిన జాబితాలు జిల్లా యంత్రాంగానికి అందాయి. జిల్లాలోని 38 మండలాల్లోని సచివాలయాల పరిధిలో 5.89 లక్షల కుటుంబాలను యంత్రాంగం సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించింది. ఆ ప్రకారం ఆర్థికంగా వెనుకబడి ఉన్న 20శాతం చూస్తే సుమారు లక్షా 20వేల కుటుంబాలు ఆర్థిక సహకారం అందించాలి. అయితే 74,550 కుటుంబాల జాబితాలను పంపించారు.

గరిష్ఠంగా టంగుటూరు మండలంలో..

ప్రభుత్వం నుంచి సమగ్రంగా వివరాలు అందడంతో తదుపరి చర్యలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. పట్టణాల్లో గరిష్ఠంగా ఒంగోలు అర్బన్‌లో 7,809 కుటుంబాలు అట్టడుగున ఉన్నాయి. కనిష్ఠంగా దర్శిలో 610 ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చూస్తే గరిష్ఠంగా టంగుటూరు మండలంలో 3,037 కుటుంబాలు, కనిష్ఠంగా పొదిలి మండలంలో 601 కుటుంబాలు ఉన్నట్లు ప్రభుత్వం పంపిన జాబితాలో పేర్కొంది.

ఎంటీఎస్ టీచర్లకు చుక్కెదురు

ఒంగోలు విద్య, మే 3 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు విధానంలో మినిమం టైం స్కేలు (ఎంటీఎస్)తో పనిచేస్తున్న డీఎస్సీ-98 టీచర్లకు తమ నివాసాలకు సమీపంలో పోస్టింగ్‌ల విషయంలో చుక్కెదురైంది. వారి అభ్యర్థనను తిరస్కరిస్తూ పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఎంటీఎస్ టీచర్లకు హెచ్‌ఆర్‌ఏ, డీఏలు ఇవ్వరు. కేవలం మూల వేతనం(బేసిక్)తో పనిచేయాలి. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని 2023లో వారిని వారి నివాసాలకు సమీపంలోని పాఠశాలల్లో నియమించాలని అప్పటి పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. 2024-25లో వీరిని మళ్లీ విధుల్లోకి తీసుకునేటప్పుడు ఈ నిబంధనను పాటించలేదు. ఈనేపథ్యంలో తమ నివాసాలకు సమీపంలో నియమించాలని కోరుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎంటీఎస్ టీచర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం వీరిని ఉద్యోగాల నుంచి తొలగించామని, పునర్నియామకంలో వీరి అభ్యర్థనను పాటించడం సాధ్యం కాదని కమిషనర్ తాజాగా జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై కార్యకర్తలు దృష్టి సారించాలి

● ఎమ్మెల్యే దామచర్ల



డివిజన్ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై దృష్టి సారించడంతో పాటు టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. శనివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో 48, 50 డివిజన్‌ల కుటుంబ సాధికార సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, ఇతర సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే ప్రజలు నమ్మకంతో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేలా అందరూ ముందుకు సాగాలన్నారు. అలాగే పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు, నాయకుడుకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. అలాగే కష్టపడిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఎల్లపుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్‌ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలులో రైతుల భూమి కబ్జా..!

● గుర్తించి కంచెను తొలగించిన యజమానులు



తమ భూహక్కు పత్రాలను చూపిస్తున్న రైతులు

ఒంగోలు కార్పొరేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో భూ ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తాజాగా మరో భూ భాగోతం వెలుగులోకి వచ్చింది. కొత్తమామిడిపాలెంలోని సర్వే నెంబర్ 115/2లో 12 ప్లాట్లకు సంబంధించి 360 గదులు ఆక్రమణలకు గురైంది. వివరాల్లోకి వెళితే.. కందులూరు గ్రామానికి చెందిన కొందరు రైతులు 30 సంవత్సరాల క్రితం వేసిన వెంచర్ 30 గదులు చొప్పున 12 ప్లాట్‌లు కొనుగోలు చేశారు. అయితే అప్పటి నుంచి వారి సంరక్షణలో ఉన్న భూమిని కాపాడుకుంటుండగా, ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆ ప్లాట్‌ల చుట్టూ కంచెను వేయడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో వారు పరిశీలించారు. వారి ప్లాట్‌లను సర్వే చేసి అప్పగించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో శనివారం తమ ప్లాట్‌లలోకి వెళ్ళి కంచెను తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం రైతులు మాట్లాడుతూ 2016లో కూడా కొందరు వ్యక్తులు తమ భూమిలో హద్దురాళ్ళు వేసి ఆక్రమించే ప్రయత్నం చేశారని, అయితే అప్పట్లో గుర్తించి తొలగించామన్నారు మరలా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తమ ప్లాట్‌ల చుట్టూ కంచెవేసి ఆక్రమించడం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు భూ కబ్జాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుని కొనుగోలుదారులకు రక్షణ కల్పించాలని కోరారు.

ఘనంగా వేద సభలు



ఎమ్మెల్యే దామచర్లను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

ఒంగోలు (కల్చరల్), మే 3(ఆంధ్రజ్యోతి) : వేద స్మార్త ప్రవర్ధక విద్వత్ పరీక్షా పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక కేశవస్వామి పేటలోని శ్రీలలితానంద ఆశ్రమంలో శనివారం వేదసభలు ఘనంగా జరిగాయి. ఒంగోలు నగరంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు, ఘనాపాటీలు పాల్గొని వేదపఠనం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముందుగా ఆశ్రమంలోని అమ్మవారి పూజలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ వేదం ద్వారా సమాజం శ్రేయస్కరంగా ఉంటుందన్నారు. వేదపండితులకు, వేద విద్యార్థులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను పరిషత్ కార్యవర్గ సభ్యులు శాలువా, జ్ఞాపికతో సన్మానించి వేదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు నేలభొట్ల సదాశివశాస్త్రి, కార్యదర్శి మహంకాళి వెంకటశేషయ్య, సముద్రాల భీమశంకరశాస్త్రి, భారతుల శ్రీనివాసశర్మ, వేదశిష్ట సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, పాలకవర్గం

చీమకుర్తి, మే3(ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తులు వెలిగించి శనివారం రాత్రి చీమకుర్తిలో మున్సిపల్ పాలకవర్గం, ఉద్యోగులు ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలో బస్టాండ్ సెంటర్ జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, కమిషనర్ వై.రామకృష్ణయ్యలు తమ ఉద్యోగులతో కలిసి ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. దేశ సరిహద్దులో పోరాడుతున్న సైనికదళాలకు తమ సంఘీభావం తెలుపుతూ మానవహారాన్ని నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్‌సెంటర్ వరకూ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో గొల్లపూడి కోటేశ్వరరావు, కందిమళ్ల గంగాధరరావు, ఆలూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఒంగోలు కార్పొరేషన్: ఫొటో గ్రాఫర్స్ వెల్ఫేర్ డవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పహల్గాంలో ఉగ్రదాడుల్లో మృతి చెందిన పర్యాటకులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాక్ ఉగ్రవాదుల దుర్మార్గ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. భారతీయులపై పాక్ ఉగ్ర చర్యలు నిరసించాలని డిమాండ్ చేశారు. స్థానిక విజయకాంప్లెక్స్ నుంచి అద్దంకి బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీలో అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్రావు, సెక్రటరీ శేఖర్, కోశాధికారి రసూల్, వైస్ ప్రెసిడెంట్ ఉప్పుటూరి చంద్ర, వెంకటేష్, గౌరవ అధ్యక్షులు జెమినీ శ్రీనివాసరావుతోపాటు అడ్వయిజర్స్ మట్ట సత్యం, హరిబాబు, కార్యవర్గ సభ్యులు, నగరంలోని ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

ఒంగోలు(కల్చరల్), మే 3(ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన తరగతులకు మొత్తం 65 మంది హాజరైనట్లు గ్రంథాలయ కార్యదర్శి ఆదిలక్ష్మి తెలిపారు. ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పర్యవేక్షణలో ఇంగ్లీషు గ్రామర్‌లో వెంకయ్య, యోగాలో టి.శ్రీనివాసరావు, క్రాఫ్ట్ లూసిడా హ్యాండ్ రైటింగ్‌లో ఆర్.బిందుమణి, స్పేర్ టైం యాక్టివిటీస్‌లో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డి.ప్రసాద్, చిత్రలేఖనంలో టి.రవీంద్రలు శిక్షణనిచ్చారు. కాగా ఆదివారం వ్యక్తిత్వ వికాసం, మోటివేషన్ తరగతులు ఉంటాయని, త్వరలో జనరల్ నాలెడ్జ్, పాటలు పాడటంలో శిక్షణకు కూడా రిసోర్స్ పర్సన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు

అధికారులకు మంత్రి స్వామి హెచ్చరిక ● మర్రిపూడిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు



వ్యవసాయ పరికరాలను రైతుకు అందజేస్తున్న మంత్రి స్వామి

మర్రిపూడి, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించబోమని మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం మర్రిపూడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నందున ప్రత్యేక గ్రీవెన్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మర్రిపూడి గ్రామాన్ని నిషేధిత భూముల జాబితాలో చేర్చడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే గ్రామకంఠం భూమిని సబ్ డివిజన్ చేయించి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావును ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రహరీగోడ నిర్మాణం కోసం తక్షణమే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ జ్వాలానరసింహంకు సూచించారు. ఈ విషయంలో జాప్యం చేస్తున్న సర్వేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల లేని ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలం ఇచ్చి పక్కా గృహాలు నిర్మిస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరారు. ఈ సందర్భంగా 32 మంది రైతులకు వ్యవసాయ పరికరాలను ఆయన పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటల వరకు అర్జీల స్వీకరణ కార్యక్రమం కొనసాగింది. 256 మంది వివిధ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. వాటిలో 25 అక్కడికక్కడే పరిష్కరించారు. మరో 70 మంగళవారం నాటికి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణమే చంద్రబాబు ధ్యేయం

ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని మంత్రి స్వామి అన్నారు. మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి అమరావతి రాజధానిని నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. అమరావతికి పూర్వవైభవం తెచ్చేందుకు చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఒకవైపు అమరావతి రాజధాని, మరోవైపు పోలవరం నిర్మాణంతో రాష్ట్రం రూపురేఖలు మారనున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను వేగవంతంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నదని వెల్లడించారు. ఇప్పటికే పింఛన్ సొమ్మును రూ.4వేలకు పెంచడంతోపాటు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. రైతు భరోసా, తల్లికి వందనం లాంటి పథకాలను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, మండల, డివిజన్ స్థాయి అధికారులు, టీడీపీ నాయకులు ఎర్రమోతు శ్రీనివాసులు, చేరెడ్డి నర్సారెడ్డి, రేగుల వీరనారాయణ, తుళ్లూరి నర్సింహారావు, గుంటు హనుమారెడ్డి, వై.వెంకటరెడ్డి, ఓబుల్‌రెడ్డి, అడ్వకేట్ బూదాల ఏసుదాస్ పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యలను పరిష్కరించాలి

● కొనసాగుతున్న సమ్మె



కలెక్టరేట్ ఎదుట ఒంటికాలిపై నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌వోలు

ఒంగోలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పిల్లలకు భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ సమ్మె కొనసాగిస్తున్నారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శనివారానికి ఐదవ రోజుకు చేరింది. కమ్యూనిటి హెల్త్‌ఆఫీసరు తమ పిల్లలతో వినూత్నంగా ఈ నిరసన చేపట్టారు. సందర్భంగా జరిగిన యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ళు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా జీతభత్యాల విషయంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని తెలిపారు. 23శాతం ఇంక్రిమెంట్‌తో పాటు ప్రతినెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ మంజూరు చేయాలని కోరారు. ప్రతి ఏడాది ఐదుశాతం ఇంక్రిమెంట్ పెంచడంతో పాటు ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వారు కోరారు. ఆయా సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎం.రాజేష్, నిర్మల, దీప్తి, కామేష్, నవీన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్కరణలతో విద్యారంగంలో గందరగోళం

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల



సమావేశంలో మాట్లాడుతున్న మంజుల

ఒంగోలు విద్య, మే 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలతో విద్యారంగాన్ని గందరగోళంలో నెడుతోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.మంజుల ఆరోపించారు. ఒంగోలులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా సబ్ కమిటీ, రాష్ట్ర కౌన్సిలర్ల సంయుక్త సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వకాలంలో 60వేల పాఠశాలలు ఉంటే ప్రస్తుత ప్రభుత్వం 90వేల పాఠశాలలను ఏర్పాటు చేసి అందరినీ అయోమయానికి గురి చేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యలో ప్రభుత్వం అసబద్ధ విధానాలకు నిరసనగా ఆందోళన చేపడతామన్నారు. ఈనెల 5న తాలూకా కేంద్రాల్లో, 9న జిల్లా కేంద్రం, 14న రాష్ట్ర స్థాయిలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. 1నుంచి 5 తరగతులు, 6నుంచి 10 తరగతులు రెండు రకాల పాఠశాలలను మాత్రమే ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియంలను కొనసాగించాలని, ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం కాకుండా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ ఉన్న మూడు డీఏలు మంజూరు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు ఎస్.గురునాథశర్మ, ఐ.విజయసారథి, బి.రఘుబాబు, బి.శేషారావు, పి.హనుమంతరావు, కె.తిరుమల, టి.సుబ్బారాయుడు, నాయబ్‌రసూల్, దేవీప్రసాద్, శేఖర్‌రెడ్డి, యోహాన్‌రెడ్డి, ఖాదర్‌బాషా, కె.రవి, శ్రీనివాసరావు రాజకుమార్, భాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

● రైతు సంఘం ప్రధానకార్యదర్శి హనుమారెడ్డి



వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

మద్దిపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేయాలని రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో జరుగుతున్న కొనుగోళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు గిట్టుబాటు ధరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యాపారులు సిండికేట్ అయ్యి ధర కల్పించటం లేదని ఆరోపించారు. నోబిడ్లు ఎక్కువై బేళ్లను తరలించడం ఇబ్బందికరంగా ఉందని, బోర్డు అధికారులు దీనిపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వెల్లంపల్లి రైతు సంఘం అధ్యక్షులు అబ్బూరి శేషగిరిరావు మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేకపోవటంతో బ్యారన్‌కు రూ.4లక్షల నష్టం వాటిల్లుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రావి ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా పొగాకు ఎగుమతులు ఆర్డర్ లేకపోవడంతో వ్యాపారులు కొనుగోలు పట్ల ఆసక్తి చూపటం లేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు తొట్టెంపూడి వెంకటశేషయ్య, నారిపెద్ది వరహాలచౌదరి, బోయపాటి వెంకయ్య, జజ్జర శరత్‌బాబు, నవులూరి సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను పక్కాగా నిర్వహించాలి : ఆర్డీవో



పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రీసర్వేను పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో శనివారం ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లకు నిర్వహించిన వర్క్‌షాపులో ఆమె మాట్లాడారు. ముందుగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గ్రామాల్లో రీసర్వే నిర్వహణ, సమస్య పరిష్కారంపై వివరించారు. అనంతరం మండలాలవారీగా రీసర్వేపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. రీసర్వే జరిగే గ్రామాల్లో ముందుగా రైతులకు నోటీసులు ఇచ్చిన తరువాత భూములను రీసర్వే నిర్వహించాలన్నారు. సర్వే సమయంలో ఏమైనా అభ్యంతరాలు వస్తే వాటిని పరిశీలించిన తర్వాత తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రీసర్వేలో ఏమైనా లోపాలు ఉంటే తహసీల్దార్లు, సర్వేయర్లే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పక్కాగా రీ సర్వే చేయాలని ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.



రవికుమార్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ దామోదర్, సీఐ శ్రీకాంత్‌బాబు

డ్రోన్ కెమెరా అందజేత

ఒంగోలు క్రైం, మే3(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ అధునాతనమైన డ్రోన్ కెమెరాను ఎస్పీ దామోదర్‌కు అందజేశారు. శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ దామోదర్‌ను కలిసి డ్రోన్ కెమెరాను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం డ్రోన్ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య పాల్గొన్నారు.

గుండ్లకమ్మ గేట్ల పనులు పూర్తి చేయాలి

మద్దిపాడు, మే 3(ఆంధ్రజ్యోతి):గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్ల పనులు జాప్యం జరిగితే రైతులతో భారీ ఎత్తున ఉద్యమం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి అన్నారు. శనివారం గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించిన ఆయన వెంటనే ప్రాజెక్టు గేట్లు మరమ్మత్తులు చేపట్టాలన్నారు. రూ.700 కోట్లు ఖర్చుపెట్టినా కనీసం రైతులకు సాగు, తాగునీరు అందించలేని పరిస్థితి ఉందని విమర్శించారు. తొట్టెంపూడి వెంకటశేషయ్య మాట్లాడుతూ గుండ్లకమ్మ గేట్లు పనులకు బ్రేక్ అవ్వటం రైతులకు ఆందోళన కలుగుతుందన్నారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ చొరవ తీసుకొని గేట్లు పనులు పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జజ్జర శరత్‌బాబు, చెరుకూరి వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

10న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ఒంగోలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఒంగోలు నగర ఎన్నికలు ఈనెల 10వ తేదీన స్థానిక సంఘ కార్యాలయంలో జరుగుతాయని ఎన్నికల అధికారి సయ్యద్‌మసూద్‌ఆలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఉదయం నామినేషన్లు స్వీకరణ, ఉపసంహరణ జరుగుతుందన్నారు. అవసరమైతే అదే రోజు పోలింగ్ ఉంటుందని తెలిపారు. సంఘం సభ్యులందరూ ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

20న దేశ వ్యాప్త సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఒంగోలులోని సీఐటీయు కార్యాలయంలో శనివాంరం కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జరిగే సమ్మెను, హర్తాల్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం.రమేష్, కొత్తకోట వెంకటేశ్వర్లు, మోహన్, కంకణాల ఆంజనేయులు, వి.బాలకోటయ్య, టి.శ్రీకాంత్, ఎంఎస్.సాయి, యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత శిక్షణ తరగతులు

ఒంగోలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం నుంచి విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు కమిటీ నాయకులు వినోద్, వీరస్వామి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. గత మూడేళ్ల నుంచి వేసవి కాలంలో పది రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ప్రయోగాలు, క్రాఫ్టింగ్, ఫన్ని మ్యాథ్స్, సెల్ఫ్ డిఫెన్స్, మెమరీ గేమ్స్, మ్యూజిక్, పాటలు, ఆటలు, కథలు నేర్పించడం జరుగుతుందన్నారు. 4 నుంచి 10వ తరగతిలోపు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి ఇంద్రజ్యోతి, మ్యాజిక్ రామన్, జేవీవీ నగర కార్యదర్శి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ విజయ కోరారు. శనివారం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో డి.సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందజేయాలన్నారు. అనంతరం జడ్పీటీసీ డి.రమణమ్మ మాట్లాడుతూ స్పౌజ్ పెన్షన్‌లను త్వరితగతిన అందజేయాలని కోరారు. మండలంలో భూముల రీసర్వేకు సంబంధించి తప్పులను సరిచేయాలని పలువురు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పార్వతీబాయి

సంతనూతలపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): కిషోర బాలికలు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూపర్‌వైజర్ పార్వతీబాయి తెలిపారు. మండలంలోని చిలకపాడు, మద్దులూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర బాలికలకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లింగంగుంట-ఏడుగుండ్లపాడు రోడ్డుకు మహర్దశ

మద్దిపాడు, మే 3(ఆంధ్రజ్యోతి):గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లకు మహర్దశ పడుతున్నది. ఎన్నికల్లో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు అనేక రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈక్రమంలో లింగంగుంట-ఏడుగుండ్లపాడు మధ్య తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో ఎప్పటినుంచో గుంతలు పడి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న ఈ రోడ్డు నిర్మాణం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 1.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణం చేయిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలకు అన్యాయం



శాసనమండలి చైర్మన్ మోజేష్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో రాష్ట్రంలో మాలలకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందని, దీనిని అడ్డుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని మాల సంఘాలు, మాల ఉద్యోగ సంఘాల నాయకులు కోరారు. శనివారం ఒంగోలుకు వచ్చిన శాసనమండలి చైర్మన్ మోజేష్‌రాజుకు ఆయా సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా మాల జేఏసీ అధ్యక్షుడు కొప్పుల ఏడుకొండలు, మాల ఉద్యోగుల సంఘం నాయకుడు అశోక్‌బాబు తదితరులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనలను ప్రభుత్వం పట్టించుకోకుండా వర్గీకరణ చేస్తుందని ఆరోపించారు. సరైన జనాభా లెక్కలు లేకుండా, ఎంపనిరికల్ డేటా లేకుండా వర్గీకరణను ఏకపక్షంగా ప్రభుత్వం చేస్తుందని ఫిర్యాదు చేశారు. అందువల్ల ఎస్సీ వర్గీకరణ జరగకుండా అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శాంసన్, కసుకుర్తి మల్లికార్జున్, టి. శ్రీకాంత్, మేడిది రవి, రమేష్, లక్ష్మీనారాయణ, పిల్లి మాల్యాద్రి, బంటుపలి, శాంతరాజు, బాలదుర్గ, బాలనారాయణ, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పీడీ జోసఫ్‌కుమార్

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

● ఎంపీడీవోలు, ఏపీవోలు జవాబుదారీతనంగా ఉండాలి ● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీపనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ఎంపీడీవోలు, ఏపీవోలు ఆపనులకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. లక్ష్యం మేరకు పనులు జరగకపోయినా చర్యలు తప్పవని తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో శనివారం సాయంత్రం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముందుగా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఉపాధి పథకం కింద జిల్లాలో నిర్వహిస్తున్న పనులు, పురోగతిని వివరించారు. ఫారంపాండ్స్‌పనులను త్వరగా పూర్తి చేసేందుకు మేనెలను ఫారం పాండ్స్ నెలగా ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ఈ పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాస్తవంగా గత నెలలో గడువు ముగినిప్పటికి ఇంకా వీటి నిర్మాణాలను పూర్తి చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు, ఏపీవోలు దీనిని జోక్‌గా తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. లక్ష్యం మేరకు ఎందుకు పూర్తి చేయడం లేదన్నారు. అలా కాకుండా ఏదో ఒక సమాధానం చెప్పి తప్పించుకోవాలంటే ఊరుకునేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఎంపీడీవోలు, ఏపీవోల పనితీరును నిశితంగా పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఉపాధి కోరిన వారందరికి పనులు కల్పించాలన్నారు. ఈ పనుల గుర్తింపునకు సంబంధించిన అనుమతులు ముందుగానే తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎంపీడీవోలు, ఏపీడీలు, ఏపీవోలు ఉన్నారు.

ప్రతి వారం పురోగతి ఉండాలి

ఇళ్ల నిర్మాణాల పురోగతిలో ప్రతివారం స్పష్టమైన పురోగతి ఉండాలని కలెక్టర్ అన్సారియా స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అన్ని నియోజకవర్గాల్లో కేటగిరీల వారీగా పురోగతిపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. పీఎం జన్‌ధన్‌పథకంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై పీఎం కార్యాలయం నుంచి పర్యవేక్షణ ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంపీడీవోలు, గృహ నిర్మాణశాఖ ఏఈఈలు సమన్వయంతో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసే విధంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఈఈలు, డీఈలు, ఏఈఈలు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ఉన్నారు.

సాంకేతిక శిక్షణతో ఉద్యోగ అవకాశాలు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా భవిష్యత్‌లో మంచి ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ఐటీఐ విద్యార్థుల శిక్షణ కోసం జిల్లాకు వచ్చిన ఇన్ఫోసిస్ ప్రత్యేక బస్సును శనివారం ఒంగోలులోని ఐటీఐ బాలుర కళాశాల వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ల్యాబ్ అన్ వీల్స్ వాహనం ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన శిక్షణ లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగశ్రీనుతో పాటు వివిధ శాఖల అధికారులు ఎం. శ్రీను, ఎస్‌కే బాషా, ఈ. శ్రీనివాసాచారి, ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు ఉన్నారు.



నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

నేడు నీట్ పరీక్ష

● ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ఒంగోలు(రూరల్)ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఆదివారం జరగనున్న నీట్ పరీక్షకు సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం సాయంత్రం పరిశీలించారు. ఒంగోలు నగరంలో డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూల్, జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయం, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో నీట్‌పరీక్షలు జరుగనున్నాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఐదు పరీక్షా కేంద్రాలలో మొత్తం 1,473 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు.ప్రతిపరీక్షా కేంద్రానికి రెవెన్యూ ,పోలీస్ శాఖల తరుపున ప్రత్యేక నోడల్ అధికారులను నియమించామన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌వో చిన ఓబులేసు,పరీక్షల నిర్వహణ సిటి కోఆర్డినేటర్ మనీష్ , ఇతర అధికారులు ఉన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షరీఫ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ముస్లింలకు న్యాయం చేయండి

● ప్రభుత్వ సలహాదారు షరీఫ్ దృష్టికి
● స్థానిక సమస్యలను తీసుకెళ్లిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని ఏపీ ప్రభుత్వ సలహాదారుడు, మాజీ శాసనమండలి ఛైర్మన్ మహ్మద్ అబ్దుల్ షరీఫ్‌ను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. మార్కాపురం పట్టణంలో ముస్లిం మైనార్టీలకు సంబంధించిన ఆస్తులను పరిశీలించేందుకు వచ్చిన షరీఫ్‌ను కొద్దిసేపు పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఎమ్మెల్యే కందుల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత కొన్ని దశాబ్దాలుగా ముస్లింలకు కలగా మిగిలిన షాదీఖానా నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉందన్నారు. అంతేకాక మార్కాపురం, పొదిలి పట్టణాల్లో ముస్లిం జనాభా ఎక్కువగా ఉందన్నారు. మార్కాపురంలో ఉన్న ఒక్క ఉర్దూ పాఠశాల వెనక్కిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ముస్లింలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కందుల కోరారు. సావధానంగా విన్న షరీఫ్ తప్పకుండా ముస్లింల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మీర్జా ఆబిద్ హుసేన్‌బేగ్, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మైనార్టీ నాయకులు మయూరి ఖాశిం, పఠాన్ హుసేన్‌ఖాన్, సయ్యద్ గఫార్, రసూల్ పాల్గొన్నారు.



చింత చిగురు విక్రయిస్తున్న మహిళలు

చింత చిగురు.. ధర చిటారు

● అవాక్కవుతున్న కొనుగోలుదారులు

మార్కాపురం వన్‌టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మన పాత తెలుగు సినిమాలలో అత్యంత ప్రాచుర్యం పొందిన చింత చెట్టు చిగురు చూడు.. చిన్నదాని పొగరు చూడు అన్నది చాలా పాపులర్ పాట. కానీ ఈరోజుల్లో ఆకాశాన్ని అంటుతున్న చింత చిగురు ధర చూడు తినేవాడి పొగరు చూడు అనే పాడాల్సి వస్తుంది. మార్కాపురం పట్టణంలో చింతచిగురు ధర అమాంతం పెరిగి ఆహార ప్రియులను కలవరపెడుతోంది. మండుతున్న ధరల సరసన తాజాగా చింత చిగురు కూడా చేరింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేజీ చింత చిగురు రూ.800 పలుకుతూ చిరాకు పుట్టిస్తుంది. కేజీ రూ.800 ఉన్న మటన్‌తో పోటీ పడుతుంది. దీంతో వినియోగదారులు చింతచిగురు కొనడానికి జంకుతున్నారు. చింత చిగురు కూరలు ఈసారి కుదరదులే. తగ్గితే కొనొచ్చులే అంటూ ప్రియులు నిట్టూరుస్తున్నారు. రికార్డు స్థాయిలో మార్కెట్‌లో చింతచిగురు ధర పలకడంతో ఇంత ధరపెట్టి కొనుగోలు చేయలేక చాలామంది వెనక్కి వెళ్లిపోతున్నారు. మార్కాపురంతో పాటు ఆంధ్ర, తెలంగాణలో చింతచిగురుతో పప్పు, ఎండుచేపల కూర, పచ్చడి, చింతచిగురు, మామిడికాయ, మటన్, చింతచిగురు వంకాయ, మటన్, తదితర అనేక రకాల వంటలు చేసుకుని తింటారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే చిగురు ధర నేడు ఆకాశానికి పాకడంతో ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. ఇంత ధరేంటని అడిగితే చింతచెట్లు కనుమరుగు అయి పోతున్నాయని, హైదరాబాద్‌లో కూడా ఇదే ధర ఉందని అమ్మేవాళ్లు బదులిస్తున్నారు. గతేడాది రూ.10కి చిగురు కుప్ప ఇస్తుండగా నేడు అదే కుప్ప రూ.100కు చేరింది.

నవ్వు నాలుగు విధాలా గ్రేటు



నవ్వటం ఒక యోగం.. నవ్వకపోవటం ఒక రోగం అంటారు. అంటే మనిషి దైనందిన జీవితంలో నవ్వుకు ఎంత ప్రాధాన్యం ఉందో ఈ ఒక్క వాక్యం తెలియజేస్తుంది. అందుకే నవ్వుతూ బతకాలిరా తమ్ముడూ నవ్వుతూ చావాలిరా అంటూ నవ్వు మీద అనేక సినిమా గీతాలు సైతం ఉన్నాయి. అటువంటి నవ్వుకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేయటానికి సంవత్సరంలో ఒక రోజును కేటాయించారు. అదే ప్రపంచ నవ్వుల దినోత్సవం

నవ్వటంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు
ఇందుకోసం ప్రత్యేకంగా లాఫ్టర్ క్లబ్‌లు
నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

ఒంగోలు (కల్చరల్), మే 3(ఆంధ్రజ్యోతి):. ప్రతి సంవత్సరం మే నెల మొదటి ఆదివారం ప్రపంచవ్యాప్తంగా నవ్వుల దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ నవ్వుల దినోత్సవానికి మన దేశంలోనే శ్రీకారం జరిగింది. 1998లో డాక్టర్ మదన్ కటారియా నవ్వటం వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో నవ్వుల దినోత్సవాన్ని ప్రారంభించారు. ఇందుకోసం ఆయన ఒక లాఫ్టర్ క్లబ్‌ను కూడా స్థాపించారు. ప్రస్తుతం మన దేశంలోనే కాకుండా అనేక దేశాలలో వందలాది లాఫ్టర్ క్లబ్‌లు పనిచేస్తున్నాయి. వీటిలో నిత్యం అనేక మంది సభ్యులుగా ఉంటూ నవ్వు కోసమే ప్రతి రోజూ ప్రత్యేకంగా కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు.



నవ్వుతో ..

మనిషి మనస్ఫూర్తిగా నవ్వటం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందుతాడని పరిశోధనలు చెబుతున్నాయి. ముఖ్యంగా మానసిక ఒత్తిడిని తగ్గించటం, రోగనిరోధక శక్తిని పెంచటం, గుండెకు శక్తిని ఇవ్వటం, మనిషిలో పాజిటివ్ ఎనర్జీని పెంపొందించటం నవ్వు ద్వారా సాధ్యమవుతుంది. అంతేకాకుండా ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారితో కలవటానికి, స్నేహం చేయటానికి అనేకమంది ఇష్టపడతారు. అంటే నవ్వు మనకు సాటివారిని చేరువ చేస్తుంది. అందుకే నవ్వినప్పుడు విడుదల అయ్యే ఆక్సిటోసిన్‌ను బంధన్ హార్మోన్ అని పిలుస్తారు.

నవ్వుకు అనేక మార్గాలు

ఇక గతంలో అయితే ఏ వారపత్రికలోనే ఒక జోక్ చూసినప్పుడో, లేదా మన కుటుంబసభ్యులు, స్నేహితులు సరదాగా మాట్లాడినప్పుడే నవ్వే పరిస్థితి ఉండేది. అయితే ప్రస్తుత కాలంలో నవ్వుకు అనేక మార్గాలు ఉన్నాయి. అదేవిధంగా అనేక చోట్ల లాఫ్టర్ క్లబ్‌లు కూడా ఏర్పడ్డాయి. మనజిల్లాలో సైతం ఒంగోలులో కొన్ని సంవత్సరాల కిందట లాఫ్టర్ క్లబ్ ఏర్పాటుచేశారు. ఇందులో అనేకమంది ముఖ్యంగా 60 సంవత్సరాలు పైబడిన వారు సభ్యులుగా ఉంటూ ప్రతి రోజూ నవ్వును ఒక యోగాలాగా చేస్తుంటారు. ఇక మన అరచేతిలోనే నవ్వుకు అనేక మార్గాలు ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందే మీమ్స్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్‌వంటి సామాజిక మాధ్యమాలలో వచ్చే జోక్ వీడియోలు, వాట్సాప్ సమూహంలో వచ్చే జోక్‌లు ఇలా మనల్ని నవ్వించి ఆరోగ్యవంతులుగా ఉంచటానికి అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఇక ప్రస్తుతం జిల్లాకు చెందిన అనేకమంది యువతీయుకులు కామెడీ షోలలో పాల్గొంటూ పదిమందిని నవ్విస్తూ పేరు సంపాదించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ రోజులో కనీసం 30 నిమిషాలైనా మనస్ఫూర్తిగా నవ్వటం ద్వారా అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే హాయిగా నవ్వుదాం.. ఆరోగ్యంగా జీవిద్దాం.

బాషాది హత్యే...!

● రూ. 15 వందల కోసం చంపేశారు
● నిందితులలో ఒకరు పాత నేరస్థుడు

ఒంగోలు క్రైం, మే3(ఆంధ్రజ్యోతి): కొప్పోలు ఫ్లైవోవర్ బ్రిడ్జి కింద శుక్రవారం మృతిచెందిన ఎస్‌కే.మహబూబ్ బాషాది హత్యేనని పోలీసులు భావిస్తున్నారు. ఆరోజు తెల్లవారుజామున ఇద్దరు దుండగులు హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటనా స్థలంలో దొరికిన సీసీఫుటేజీ ఆధారంగా హత్య జరిగినట్లు గుర్తించారు. నిందితులలో ఒకరు పాత నేరస్థుడు ఉండటం గమనార్హం. ఒంగోలు రైల్వేస్టేషన్ పరిసరాలలో చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే ఓ వ్యక్తి, చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ ఉండే మరొకరు కలిసి తెల్లవారుజామున బ్రిడ్జి కింద పడుకున్న మహబూబ్ బాషా వద్దకు వచ్చి అతని వద్ద ఉన్న నగదు రూ. 15 వందలు లాక్కునే ప్రయత్నం చేశారు. దీంతో వారి మధ్య పెనుగులాట జరిగింది. దుండగులు ముందుగా తెచ్చుకున్న కత్తితో బలంగా చాతిపై పొడవడంతో మహబూబ్ బాషా మృతి చెందాడని పోలీసులు భావిస్తున్నారు. అనుమానితులను గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

బాలిక కిడ్నాప్ కథ సుఖాంతం

కేసును ఛేదించిన పోలీసులు
అపహరించుకెళ్లింది లింగసముద్రం మండలం ఎర్రారెడ్డిపాలెం వాసి
చిన్నారి నాయనమ్మ మద్యం మత్తులో ఉండగా తీసుకెళ్లిన వైనం
వలేటివారిపాలెంలోని నిందితుడి బంధువుల వద్ద పాప
ఎస్పీ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగింత

సింగరాయకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డినగర్‌కు చెందిన మూడేళ్ల ఐశ్వర్య కిడ్నాప్ కథ సుఖాంతమైంది. మూడు రోజుల్లోనే పోలీసులు కేసును ఛేదించారు. నెల్లూరు జిల్లా వలేటివారిపాలెంలో చిన్నారి ఉన్నట్లు గుర్తించారు. పాపను ఒంగోలు తీసుకెళ్లి ఎస్పీ దామోదర్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు.. బాలిరెడ్డినగర్‌కు చెందిన చిలకూరి హరికృష్ణ, శిరీష దంపతులు కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తుంటారు. వీరికి మూడేళ్ల పాప ఐశ్వర్య ఉంది. బుధవారం వారు కుమార్తెను నాయనమ్మ రాజేశ్వరి వద్ద ఉంచి పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సారికి పాప కనిపించలేదు. నాయనమ్మను ప్రశ్నించగా తడబాటుకు గురవుతూ పొంతనలేని సమాధానాలు చెప్పింది. దీంతో ఐశ్వర్య తల్లిదండ్రులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదు చేశారు. ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సింగరాయకొండ సీఐ హజరయ్య, ఎస్సై మహేంద్ర, సిబ్బంది మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు.

సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తింపు

పోలీసులు సింగరాయకొండలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. రైల్వే స్టేషన్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి ఐశ్వర్యను తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. పాప నాయనమ్మ రాజేశ్వరి కూడా కిడ్నాపర్ పక్కనే ఉండటంతో వెంటనే ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు పాపను తీసుకెళ్లిన వ్యక్తి నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం ఎర్రారెడ్డిపాలెంనకు చెందిన అల్లూరి నరసింహంగా గుర్తించారు. బాలిక నాయనమ్మ రాజేశ్వరి మద్యానికి బానిస. ఐశ్వర్యను తీసుకొని ఆమె రైల్వే స్టేషన్ రోడ్డుకు వెళ్లగా.. అక్కడ నరసింహం ఆమెతో మాటలు కలిపాడు. అనంతరం ఇద్దరూ కలిసి రైల్వే స్టేషన్ వద్ద మద్యం సేవించారు. రాజేశ్వరి మత్తులో ఉండగా నరసింహం చిన్నారిని తీసుకొని వెళ్లిపోయినట్లు పోలీసుల విచారణలో తేలింది. అక్కడి నుంచి నిందితుడు ఎటువైపు వెళ్లాడు? ఏ బస్సు ఎక్కాడు? అన్నదాన్ని సీసీ ఫుటేజీల ద్వారా సేకరించారు. ఆదిశగా విచారణ చేపట్టారు. పాప కిడ్నాప్ ఉదంతాన్ని, ఫొటోలను సోషల్ మీడియాలోనూ వైరల్ చేశారు.

వలేటివారిపాలెంలో పాప గుర్తింపు

ఐశ్వర్యను కిడ్నాప్ చేసిన నరసింహం నేరుగా వలేటిపాలెంలో వెంచర్ దగ్గర వాచ్‌మన్‌గా ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. పాపను వారి వద్ద ఉంచి ఉడాయించాడు. శనివారం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి పాపను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

అనంతరం ఒంగోలు తీసుకెళ్లి ఎస్పీ దామోదర్ ఎదుట హాజరుపర్చారు. ఆయన ఐశ్వర్యను తల్లిదండ్రులకు అప్పగించారు. కిడ్నాప్ కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ హరజత్తయ్య, ఎస్సై మహేంద్ర, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్, తిరుపతి స్వామి, కానిస్టేబుళ్లు చిన్న, సుమన్, ఖాజా, చంద్రశేఖర్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఐశ్వర్య తల్లిదండ్రులు కూడా తమ పాపను క్షేమంగా అప్పగించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

'పది' ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

● పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం

ఒంగోలు విద్య, మే 3 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలని పాఠశాల విద్యా కమీషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 19నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణులు అయ్యేలా తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. ఈనెల 18 వరకు రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు ఆర్‌జేడీలు, డీఈవోలను కమిషనర్ ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులు తమకు సమీపంలోని పాఠశాలల్లో ఈ ప్రత్యేక తరగతులకు హాజరు కావాలన్నారు. సబ్జెక్టు టీచర్లు తమ సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులను గుర్తించి వారందరూ ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

కార్మికులకు బకాయిల చెల్లింపు

గిద్దలూరు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): బకాయిల కోసం కొన్ని నెలలుగా వేచిచూస్తున్న కార్మికులకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చొరవతో వారి జీతాలు వెంటనే చెల్లించారు. బేస్తవారపేట పంచాయతీ కార్మికులు గత కొంతకాలంగా జీతాల బకాయిలు రావలసి ఉండగా ఈ అంశంపై అనేక పర్యాయాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా పరిష్కారం కాకపోవడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి కార్మికులకు రావలసిన బకాయి మొత్తం వెంటనే చెల్లించాలని ఆదేశించడంతో ఏక మొత్తంలో చెల్లించారు. ఇక నుంచి ప్రతి నెలా కార్మికులకు జీతాలు చెల్లించాలని అధికారులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆదేశించారు.







37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం.

నేను రుణపడేది ఆయనకే!

తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... కె. రాఘవేంద్రరావు. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...



మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

• హీరో కావాలని అనుకోలేదు

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

• లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్‌వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

• మూడు తరాల హీరోలతో...

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

• ఆ టెన్షన్ ఉండేది

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకోవచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

• సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి

సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

• పాటలో మొత్తం రామాయణం

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు', 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.

• వినాయకరావు

ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్స్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్స్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జిని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

28 రోజుల్లో 'జ్యోతి'



ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు...' అని వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.

ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'



నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలిన ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీలో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్	THE DIPLOMAT	
ది డిప్లొమాట్	హిందీ చిత్రం	మే 09
గుడ్ బ్యాడ్ అగ్లీ	తమిళ చిత్రం	మే 08
ది రాయల్స్	హిందీ సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్	Royals	
గ్రామ్ చికిత్సాలయ్	హిందీ చిత్రం	మే 09
జియో హాట్‌స్టార్		
స్టార్‌వార్స్	యానిమేషన్ సిరీస్	మే 04

వినోదాత్మక చికిత్స



ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.

బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

- ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.
- బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.



- బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.
- బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

- ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

- సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.
- విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.
- నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్ వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
- విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.
- కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.
- విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



అద్భుతమైన మహిళల కోసం

నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.



"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలోమీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.

దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

మహిళా దినోత్సవంనాడు...

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోర్ట్రైట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్ట్‌ను చేపట్టాను."

సంపాదించింది అంతా...

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.

- బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం



ఛిద్రమైన నాగులవరం - అర్ధవీడు రోడ్డు

రోడ్ల నిర్మాణానికి రూ.7కోట్ల నిధులు

అర్ధవీడు (కంభం), మే 3 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు, కంభం, బేస్తవారపేట మండలాల్లో పూర్తిగా దెబ్బతిన్న రహదారుల నిర్మాణానికి రూ.7కోట్ల నాబార్డ్ నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. గత 5 సంవత్సరాల వైసీపీ పాలనలో నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రధాన రహదారులన్నీ మరమ్మతులకు నోచుకోకపోవడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రాళ్లు తేలిన ఈ రహదారుల్లో ప్రయాణం చేయడం నరకంగా ఉందని, రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరడంతో తాను రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి నాబార్డ్ నిధులు రూ.7 కోట్లు మంజూరు చేయించానన్నారు. అర్ధవీడు మండలం నాగులవరం గ్రామం నుంచి వెలగలపాయ వరకు 3.50 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.1.50కోట్లు, కంభం మండలం యర్రబాలెం గ్రామం నుంచి అర్ధవీడు మండలం మొహిద్దీన్‌పురం గ్రామం వరకు 4.10 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు, బేస్తవారపేట మండలం కోనపల్లె నుంచి సీతారామపురం 19.11 కిలోమీటర్ల నిర్మాణం కోసం రూ.4కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు.

గ్రంథాలయంలో వినోదం..విజ్ఞానం

- వేసవి శిక్షణకు చక్కని స్పందన
- 40 రోజులపాటు తరగతులు
- వినియోగించుకోవాలంటున్న గ్రంథపాలకులు



ఆటను నేర్చుకుంటున్న చిన్నారులు

ఎర్రగొండపాలెం రూరల్ మే 3 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులతో విద్యార్థులకు వినోదం.. విజ్ఞానం అందుతుంది. వేసవి కాలంలో పిల్లలకు వేసవి శిక్షణ తరగతులతో పాటు వినోదాన్ని అందించేందుకు కార్యచరణ జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాలతో వేసవి కాలంలో పిల్లలు ఎండల దెబ్బకు గురి కాకుండా వారిలో ఉన్న టాలెంట్‌ను బయటకు తీసి వారికి వినోదాన్ని అందించేందుంకు వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎర్రగొండపాలెంలోని గ్రాంథాలయంలో గ్రంథపాలకురాలు కే ఝూన్సీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ, వినోద కార్యక్రమాలు సాగుతున్నాయి. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ తరగతులలో ముఖ్యంగా వెనుకబడి ఉన్నవారిని



డ్రాయింగ్‌ను చూపుతున్న బాలికలు

గుర్తించి 40 రోజులలో వారికి విజ్ఞానం, వినోదాన్ని అందిస్తున్నారు. ఈ మేరకు పలు అంశాలపై వారికి శిక్షణ ఇస్తున్నారు.

రోజూ కార్యక్రమాలు

40 రోజుల శిక్షణ తరగతుల భాగంగా ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గణితంలో మెళకువలు, క్విజ్ పోటీలు, నీతి కథలు, తెలుగు కథలు చదవడం, రాయడం, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, పత్రికలు చదివించడం, నృత్యాలు తదితర వాటిపై శిక్షణ ఇస్తారు. నేర్చుకున్న వాటిపై చివరి రోజున పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు బహుమతులు అందిస్తారు.

క్రమం తప్పకుండా పిల్లలను పంపించాలి

వేసవి కాలంలో పిల్లలు ఎండలకు బయట తిరగకుండా చల్లని వాతావారణంలో పలు అంశాలపై 40 రోజుల పాటు గ్రాంథాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు ఎర్రగొండపాలెం గ్రంథపాలకురాలు కె ఝూన్సీ తెలిపారు. పరిసర ప్రాంతాల పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలను క్రమం తప్పకుండా శిక్షణ తరగతులకు పంపించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- కే ఝూన్సీ, గ్రంథపాలకురాలు



పంచాయతీ కార్యాలయం వద్ద బైఠాయించిన మహిళలు

సుందరయ్య కాలనీకి నీళ్లివ్వండి

ఆందోళన వ్యక్తం చేసిన కాలనీ వాసులు

పెద్దదోర్నాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక సుందరయ్య కాలనీ వాసులు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఆందోళనకు దిగారు. గత మూడు రోజులుగా ట్యాంకర్లతో నీటి సరఫరా నిలిపి వేయడంతో ఇబ్బందులు పడుతున్నామని, పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని అందించినట్లయితే ఇబ్బందులు తప్పుతాయన్నారు. స్పందించిన కార్యదర్శి శివ కోటేశ్వరరావు ట్రాక్టర్ రిపేరులో ఉండడంతో జాప్యం జరిగిందని తక్షణమే ట్యాంకరుతో నీటిని సరఫరా చేస్తామని, తదుపరి పైపులైన్ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ప్రమాదకర ప్రయాణంతోనే ప్రాణహాని



అవార్డును అందుకుంటున్న నిజాముద్దీన్

మార్కాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇష్టారీతిన కూలీలను ట్రాక్టర్లలో ఎక్కించి ప్రమాదకరంగా ప్రయాణిస్తే ప్రాణహాని తప్పదని మార్కాపురం టౌన్ ఎస్సై డాక్టర్ ఎమ్.రాజమోహన్‌రావు అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం వేకువజామునే వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని పట్టణ పోలీసులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు డ్రైవర్లు ఇష్టం వచ్చినట్లు ట్రాక్టర్లలో కూలీలను తరలిస్తుండడంతో వారిని ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. అదే విధంగా పలు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండడంతో వారిని దింపివేశారు. పలు వాహనాల యజమానులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట టౌన్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ

గిద్దలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : శాఖ గ్రం థాలయంలో వేసవి శిక్ష ణ తరగతులు కొనసాగుతున్నాయి. 5వ రోజు శనివారం 46 మంది విద్యార్థులు హాజరు కాగా వారికి స్పోకెన్ ఇంగ్లీష్‌ను నేర్పించారు. జాతీయ నా యకుల జీవిత చరిత్రలను వివరించారు. డ్రా యింగ్ నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, ఫ్యాకల్టీలు శివప్రసాద్, నాగూర్‌వలి, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

బేస్తవారపేట : గ్రంథాలయంలో శనివారం జరిగిన వేసవి శిక్షణ తరగతులకు 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ నేర్పించడంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : వేసవి శిక్షణ తరగతులను చిన్నారులు వినియోగించుకోవాలని గ్రంథ పాలకుడు వెంకట సుబ్బారెడ్డి అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం చిత్రలేఖనం, ఆంగ్లంలో చదవడం, రాయడం నేర్పించారు. ఫ్యాకల్టీ శేషిరెడ్డి పాల్గొన్నారు.

చెడు అలవాట్లను వీడాలి

జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్



మాట్లాడుతున్న న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కుటుంబసభ్యులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని, అలాగే చెడు అలవాట్లను విడనాడాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ ఓంకార్ అన్నారు. శనివారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. మేడే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలతో వారోత్సవాలను నిర్వహిస్తుండగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాల ఫలాలను ప్రతి ఒక్కరూ అందుకోవాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధమన్నారు. ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, వారి అభ్యున్నతికి తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని తెలిపారు. కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న గుర్తింపు కార్డులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కార్డుదారులకు ఆర్థికంగా ఆదుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, మేనేజర్ బీవీ రంగారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాదర్ వలి, అసిస్టెంట్ ఇంజనీర్ కె.పోసియా, ప్యానల్ లాయర్ ఎం.పిచ్చయ్య, న్యాయవాది ఇ.బాలక్రిష్ణ, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిజిటల్ గ్రీన్ కోఆర్డినేటర్ కమలాకర్

ఫార్మర్-చాట్‌పై అవగాహన

గిద్దలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మిర్చ ప్రాజెక్టు, ఫార్మర్ చాట్‌పై రైతులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో డిజిటల్ గ్రీన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కమలాకర్ మాట్లాడుతూ రైతులకు వాతావరణ పరిస్థితులను, పంటలకు సంబంధించిన ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, పంట యాజమాన్యంపై ఉన్న అనుమానాలు, పంటల మార్కెట్ రేట్లు తదితర విషయాలను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ-యాప్ తెలుగు భాషలో కూడా అందుబాటులో ఉండడంతో రైతులకు ఎంతగానో ఉపయోగకరమని పేర్కొన్నారు. పంటలో పోషక లోపాలు, పురుగులు, తెగుళ్లను గుర్తించి నివారణ చర్యల సమాచారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ లక్ష్మీరెడ్డి, ఉద్యాన శాఖాధికారులు శ్వేత, విష్ణుప్రియ, వ్యవసాయశాఖ అధికారులు భాస్కర్‌రెడ్డి, రాజశ్రీ పాల్గొన్నారు.

వైభవంగా తిరునాళ్ల మహోత్సవం



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణకిశోర్‌రెడ్డి

రాచర్ల (గిద్దలూరు), మే 3 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం అచ్చంపేటలో రామయోగి స్వామి తిరునాళ్ల మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ నిర్వహించిన బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు యోగానంద్, టీడీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న నిజాముద్దీన్

నిజాముద్దీన్‌కు అవార్డు

గిద్దలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరుకు చెందిన యువకేర్ సేవా సైనికుడు మొగల్ నిజాముద్దీన్‌కు యంగ్ ఇండియన్ సేవా పురస్కార్ అవార్డు లభించింది. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ ఖాళీ సమయాల్లో యువ కేర్ సేవా సంస్థ తరపున 19సార్లు రక్తదానం చేశారని, కొవిడ్ సమయంలో సేవా కార్యక్రమాలు చేసినందుకు నిజాముద్దీన్‌కు హైదరాబాద్‌లోని యంగ్ ఇండియన్ బ్లడ్ డోనార్స్ క్లబ్ ఈ అవార్డును ప్రదానం చేసింది. నిజాముద్దీన్‌కు అవార్డు రావడంపై కేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ఆరిఫ్‌వుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు.

డిజైన్ స్లేట్ కార్మికుల కూలి రేట్లు పెంచాలి



యాజమాన్యాలకు వినతిపత్రాన్ని ఇస్తున్న కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : డిజైన్ స్లేట్ కార్మికుల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి అన్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో డిజైన్ స్లేట్ అండ్ మొజాయిక్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఫి మాట్లాడుతూ.. కూలి రేట్ల అగ్రిమెంట్ల కాలపరిమితి ముగిసిందని, నూతన ఒప్పందం చేసుకుని కూలి రేట్లు వెంటనే పెంచాలన్నారు. ఆపరేటర్‌కు రూ.297 నుంచి 371, హెల్పర్‌కు రూ.294 నుంచి 367, ఫిట్టర్‌కు రూ.320 నుంచి 400 రూపాయలకు పెంచాలన్నారు. క్యాలిబ్రేషన్ కార్మికులకు రూ.150 నుంచి 180కి పెంచాలన్నారు. ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా డిజైన్ స్లేట్ అసోసియేషన్ కార్యాలయంలో కూలి రేట్లతో కూడిన నోటీసును అందించారు. కార్యక్రమంలో రూబెన్, బాలశేషయ్య, రాములు, మల్లమ్మ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివభక్తులు

పుల్లలచెరువు సెంటర్‌లో చలివేంద్రం

ఎర్రగొండపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : వైపాలెంలోని పుల్లలచెరువుసెంటరులో శనివారం అరుణాచలం శివ భక్తుల బృందం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలోని వివిధ గ్రామాల నుంచి పనులపై ఎర్రగొండపాలెం టౌన్‌కు వచ్చే ప్రజలకు వేసవి చలివేంద్రాన్ని దోహద పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీవీ సుబ్బారెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చీదెళ్ల నాగేశ్వరరావు, అరుణాచలం శివ భక్తులు పాల్గొన్నారు.

ఉచిత సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలి

బేస్తవారపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ గుర్తుంపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులను చేసుకోవాలని ఎంఈవో సీవీ రమణారెడ్డి తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు పేదలకు ఉచితంగా అవకాశం కల్పించిందని, ఈనెల 2 నుంచి 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాధిక్

డిప్యూటీ సీఎంపై దుష్ప్రచారం మానుకోవాలి

జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాధిక్

మార్కాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ పద్ధతిని మానుకోవాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాధిక్ హితవు పలికారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో సాధిక్ మాట్లాడారు. ముస్లిం సమాజాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉగ్రవాదులన్నారని వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పనిగట్టుకుని వైసీపీ నాయకులు ఇలా విషప్రచారంతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారన్నారు. సనాతన ధర్మానికి కట్టుబడిన వ్యక్తి అయినా ఏనాడు పరమతాలను అవమానపరిచే విధంగా ప్రదర్శించలేదన్నారు. వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. సమావేశంలో సోను, రమేష్, పాపయ్య, చందు పాల్గొన్నారు.

కులగణనపై హర్షం

గిద్దలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే జాతీయ జనాభా లెక్కల నాటికి కులగణన చేర్చాలని ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మైలురాయి వంటిదని బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ గుమ్మా రాముడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో బ్రిటీష్ ప్రభుత్వం 1931లో చివరి కులగణనను చేపట్టిందని, 94 ఏళ్ల తరువాత ఈ ప్రక్రియను మోదీ ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. దీనివల్ల అన్ని కులాలకు సమాన అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్, దాని కూటమి పక్షాలు కులగణనను రాజకీయ సాధనంగా ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు.

ఉర్దూ ఉపాధ్యాయులనే నియమించాలి



షరీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రుటా నాయకులు

మార్కాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయులను మాత్రమే నియమించాలని రాష్ట్ర ఉర్దూ ఉపాధ్యాయ సంఘం (రుటా) నాయకులు శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఉర్దూ పోస్టులకు సంబంధించి క్యాడర్ స్ట్రెంత్‌ను ఏర్పాటు చేయడంలో ఉర్దూ డీఏ సలహాలను, సహకారాన్ని తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉర్దూ పోస్టులు రేషనలైజేషనల్‌లో పోకుండా సర్‌ప్లస్ నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రుటా జిల్లా అధ్యక్షుడు షేక్ అన్వర్‌బాషా, అష్రాఫ్ అలి, ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు పఠాన్ వహీద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంబీఎఫ్ఏ వార్షిక కూటములు



హాజరైన బాప్టిస్టు ఫీల్డ్ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం బాప్టిస్టు ఫీల్డ్ అసోసియేషన్ వార్షిక కూటములు స్థానిక సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా బాప్టిస్టు ఫీల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ దేవానందం మాట్లాడుతూ.. మార్కాపురం బాప్టిస్టు సమాజంలోని అన్ని బాప్టిస్టు సంఘాల అభివృద్ధి కోసం కోసం తమవంతు కృషి చేస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. క్రైస్తవ మిషనరీ ఆస్తుల పరిరక్షణ కోసం క్రైస్తవులందరూ ఐక్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ యు.చిన్నకాశయ్య, కార్యదర్శి ఎన్‌డీ అబ్రహం, వినుగొండ విల్సన్, జాషువా, పాస్టర్లు గుర్రం శేఖర్, జార్జిబాబు, విజయభాస్కర్‌రావు, ఆరు మండలాల, 22 బాప్టిస్టు సంఘాల పాస్టర్లు, రాయబారులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మొబైల్ అప్పగింత

రాచర్ల (గిద్దలూరు), మే 3 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన కె.అనూఫ్ ఇటీవల రాచర్లకు వస్తూ మార్గమధ్యంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సెల్‌ఫోన్ విషయాన్ని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై కోటేశ్వరరావు సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రీడాకారులతో నిర్వాహకులు

మార్కాపురం వన్‌టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : క్రీడలలో గెలుపు ఓటమిని సమానంగా స్వీకరించాలని కమలా విద్యా సంస్థల ఛైర్మన్ పెనుగొండ పవన్ కుమార్ అన్నారు. స్థానిక కమలా పాఠశాలలో 54వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలు ప్రారంభించిన అనంతరం పవన్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయులు, జిల్లా హ్యాండ్ బాల్ సెక్రటరీలు రవికుమార్, శ్రీకాంత్, గణేష్, లక్ష్మణ్, మహబూబ్ బాషా, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ముండ్లమూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గెలుపోటములను సమానంగా తీసుకోవాలని వీసీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు అడుసుమల్లి కిషోర్ అన్నారు. శనివారం ముండ్లమూరులో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పూరిమెట్ల, తూర్పు గంగవరం జట్ల మధ్య జరిగిన పోటీలో పూరిమెట్ల జట్టు విజేతగా నిలిచింది. ఆతర్వాత పూరిమెట్ల, వేంపాడు జట్ల మధ్య జరిగిన పోటీలో పూరిమెట్ల జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో ఫణి, సురేష్, వీవీ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగార్పమ్మ కొలుపులు

ముండ్లమూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరిమెట్ల గ్రామంలో శనివారం నాగార్పమ్మ అమ్మవారి కొలుపులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

నీటితొట్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

పామూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పశువుల నీటితొట్ల నిర్మాణాలను త్వరితిగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. మండలంలోని దూబగుంటలో నిర్మించిన నీటి తొట్లను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో మండల వ్యాప్తంగా 25 గ్రామ పంచాయతీల్లో 37 పశువుల నీటి తొట్లను నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు 25 పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో బి.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఏడుకొండలుకు సన్మానం

పామూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆయూష్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన డాక్టర్ గద్దె ఏడుకొండలను కంభాలదిన్నె గ్రామ టీడీపీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని కంబాలదిన్నె ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ గద్దె ఏడుకొండలును జిల్లా ఆయూష్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా శనివారం గ్రామ టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగురైతు మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య, మోపాడు ప్రాజెక్టు సూపర్‌చైర్మన్ చుంచు కొండయ్య, నన మూరి వెంకటేశ్వర్లు, ఏలూరి నరశింమారావు, చుంచు నరశింహారావు, కొండ వెంకటేశ్వర్లు, చుంచు చిన కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

20న దేశ వ్యాప్త సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతంచేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జరిగే సమ్మెను, హర్తాల్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రమేష్, కొత్తకోట వెంకటేశ్వర్లు, మోహన్, కంకణాల ఆంజనేయులు, వి.బాలకోటయ్య, టి.శ్రీకాంత్, ఎంఎస్.సాయి, యు.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పిల్లలకు భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శనివారానికి ఐదో రోజుకు చేరింది. కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసరు తమ పిల్లలతో వినూత్నంగా ఈ నిరసన చేపట్టారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ళు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా జీతభత్యాల విషయంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని తెలిపారు. 23శాతం ఇంక్రిమెంట్‌తో పాటు ప్రతినెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ మంజూరు చేయాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎం.రాజేష్, నిర్మల, దీప్తి, కామేష్, నవీన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఈఏడాదైనా వసతి గృహానికి మోక్షం కలిగేనా!

- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని గత వైసీపీ పాలకులు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న గ్రామీణ ప్రాంత బాలికలు
- వినియోగంలోకి తెచ్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు



దొనకొండ జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్మించిన బాలికల వసతిగృహ భవనం

దొనకొండ, మే 3(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని జడ్పీ పాఠశాల ఆవరణలో బాలికల కోసం నిర్మించిన వసతి గృహం ఈఏడాదైనా అందుబాటులోకి వస్తుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. దొనకొండలో ఎస్సీ బాలురు-1, ఎస్సీ బాలురు-2, బీసీ బాలురు, బీసీ బాలికల వసతి గృహాలు ఉన్నాయి. ఎస్సీ బాలికల వసతి గృహం లేకపోవటంతో గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు విద్యకు దూరమవుతున్నారు.

గామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు చెందిన బాలికలకు పూర్తిస్థాయి సౌకర్యాలతో విద్య అందించాలనే ధ్యేయంతో 2018 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 150 మంది బాలికలు ఉండేందుకు దొనకొండకు బాలికల వసతి గృహం మంజూరు చేసింది. జడ్పీ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేస్తే అనువుగా ఉంటుందని అప్పట్లో అధికారులు గుర్తించి భవన నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టారు. దాదాపు కోటిన్నర రూపాయల వ్యయంతో మంజూరైన వసతి గృహ భవనానికి అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు శంకుస్థాపన చేశారు. 2021 ఆగస్టులో భవనం నిర్మాణం పూర్తయింది.

అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమాత్రం పట్టించుకోకపోవటంతో వసతి గృహ భవనం నిరుపయోగంగా మారింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేద బాలికల ఉన్నత చదువుకు చేయూత అందించాలనే లక్ష్యానికి తూట్లు పొడిచినట్లు అయింది. గతేడాది అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం నిరుపయోగంగా ఉన్న వసతి గృహాన్ని వినియోగంలోకి తెచ్చేలా దృష్టి సారించింది. వెంటనే పెండింగ్ పనులు చేపట్టేందుకు రూ.2.24 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో వసతి గృహ భవనంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేశారు. అవసరమైన సిబ్బంది నియామకాలకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. విద్యా సంవత్సరంలో వసతి గృహాన్ని వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో భవనం ప్రారంభం

వీవీ రామాంజనేయులు, హెచ్‌ఎం, జడ్పీ ఉన్నత పాఠశాల



బాలికల వసతి గృహ భవనాన్ని త్వరలో ప్రారంభించేలా ఉన్నతాధికారులు చర్యలు చేట్టారు. ఉన్నతాధికారులు ఇటీవల సిబ్బంది నియామకం చేపట్టారు. అవసరమైన వంటసామగ్రి అందు బాటులోకి వచ్చింది. వచ్చే విద్యా సంవత్సరంలో వసతి గృహంలో అడ్మిషన్లు పొందేలా ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

గడియార స్తంభం కూల్చివేతపై భిన్నాభిప్రాయాలు



దర్శిలోని గడియార స్తంభం

దర్శి, మే 3(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని కూడలిలో ఉన్న గడియారస్తంభం కూల్చివేతపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణం సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు అవగాహన లేకుండా ఒక వైపునకు నిర్మించటంతో వాహనాలు మళ్లేందుకు తీవ్ర ఇబ్బందిపడాల్సి వస్తుంది. ప్రస్తుతం వాహనాల రద్దీ అధికం కావటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. పట్టణ విస్తీర్ణం పెరగటంతో నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయింది. ఈనేపథ్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన గడియార స్తంభాన్ని తొలగించాలని అధికారులు నిర్ణయించారు. కొంతమంది దీనిని తొలగించకుండా చుట్టూ ఉన్న రోడ్డు విస్తరించాలని కోరుతున్నారు.

గతంలో రోడ్ల విస్తరణ సమయంలో వ్యాపారాలు కోల్పోయిన వారికి అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ ప్రభుత్వ స్థలంలో షాపులు కేటాయించింది. ఇప్పుడు ఆ షాపులు తొలగిస్తే వారి జీవనోపాధి దెబ్బతింటుంది. కొంతమంది గడియారస్తంభం తొలగింపును రాజకీయం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల సమస్య తీర్చటం కోసం ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న గడియార స్తంభాన్ని తొలగించేందుకు కొందరు అడ్డంకులు కల్పించే ప్రయత్నం చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి గడియారస్తంభం తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరిన విషయం తెలిసిందే.

అలాగే, కొంతమంది గడియారస్తంభాన్ని తొలగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. అధికారులు కౌంటర్ దాఖలు చేయటంతో తమకు అనుకూలంగా వచ్చినట్లు నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం గడియారస్తంభం తొలగించేందుకు ఎలాంటి అడ్డంకులు లేవన్నారు. ట్రాఫిక్‌కు అడ్డంకిగా నిలచిన గడియార స్తంభాన్ని త్వరలో తొలగిస్తామని ఆయన తెలిపారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ నారాయణ

కనిగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): దర్శిలో జూన్ 21, 22, 23 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా 17వ మహాసభలను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. శనివారం స్థానిక దర్శి చంచయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేయాలన్నారు. ప్రకాశం జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయటంలో సీపీఐ ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ఎన్నికలకు ముందు పోలవరం పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు వరంగా ఇస్తామని సీఎం చంద్రబాబు వాగ్దానం చేశారని గుర్తు చేశారు. రాజధాని పునర్నిర్మాణం పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రకాశం జిల్లాకు తాగు, సాగు నీరు అందాలంటే కృష్ణా జలాలు జిల్లాకు తీసుకురావాలన్నారు. ఇది కేవలం వెలిగొండ పూర్తితోనే సాధ్యమవుతుందన్నారు. అటువంటి ప్రాజెక్టును పూర్తిచేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. జిల్లా వాసులను ప్రభుత్వాలు మోసం చేస్తూనే ఉన్నాయని ఆరోపించారు. దొనకొండ పారిశ్రామిక క్యారిడార్‌తో పాటు కనిగిరిలో నిమ్జ్ , ట్రిపుల్‌ఐటీ వంటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా తెరపైకి రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుచేస్తామని కల్లబొల్లి మాటలు చెప్తున్నారని నారాయణ ధ్వజమెత్తారు. బయోగ్యాస్ ఏర్పాటుతో ప్రజలకు ఉపాధి, నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని ప్రజల్ని మభ్యపెడుతున్నారన్నారు. జిల్లాలోని పాలేటిపల్లి, మల్లవరం లాంటి రిజర్వాయర్‌లను ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాలేదన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు వై.రవీంద్రబాబు, యాసిన్, గుజ్జుల బాలిరెడ్డి, జీపీ రామారావు, మోహన్, సుబ్బారావు, కల్యాణ్, పూర్ణచంద్రరావు, నజిముద్దీన్, మీరావలి, ఇఫ్రాజ్, గణేష్ పాల్గొన్నారు.

ముందుకు కదలని మురుగు

- పలుచోట్ల కాల్వల ఆక్రమణ
- ఇబ్బందులు పడుతున్న పామూరువాసులు

పామూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలుచోట్ల మురుగు కాల్వలు ఆక్రమణలకు గురయ్యాయి. మురుగునీరు ముందుకు కదలక రోడ్లపైకి చేరుతుంది. దీంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ప్రధాన కాల్వను ఆక్రమించి నిర్మాణాలు చేశారు. దీంతో మురుగు నీరు ఎక్కడికక్కడ పేరుకుపోతుంది. పంచాయ తీ పారిశుధ్య కార్మికులు సైతం మురుగును తొలగించేం దుకు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వపై నిర్మాణా లతో మురుగును తొలగించలేకపోతున్నారు. సీఎస్‌పు రం రోడ్డులోనూ అధ్వానంగా ఉంది. తూరువీధిలో కా ల్వలు సక్రమంగా లేకపోవడంతో ఎక్కడినీరు అక్కడ నిల్వ ఉండిపోతున్నది. దాంతో దుర్వాసనతో పాటు దో మల ఉత్పత్తి కేంద్రంగా మారాయి. ఎటువంటి రోగాలు సంభవిస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు



నెల్లూరు రోడ్డులో అధ్వానంగా ఉన్న మురుగు కాల్వ



సీఎస్‌పురం రోడ్డులో నిలిచిఉన్న మురుగు నీరు

మురుగునీరు నిలిచిపోవడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా పరిసరాలు అప రిశుభ్రంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసు కోవాల్సిన అవసరం ఉంది. అవసరమైన చోట మరమ్మ తు పనులు చేపట్టి ప్రజలు ఇబ్బందులను తొలగించా లని పలువురు కోరుతున్నారు.

కనిగిరిలో శునకాల స్వైరవిహారం

- ఒకేరోజు 30 మందిపై దాడి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



కనిగిరిలో స్వైరవిహారం చేస్తున్న శునకాలు

కనిగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల పలుమార్లు పాదచారులు, వాహనదారులను గాయపరచిన సంఘటనలు ఉన్నాయి. వీధుల్లోకి రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది.

పట్టణంలోని 20 వార్డుల్లో శునకాలు విపరీతంగా ఉన్నాయి. గతంలో వీటిని పట్టుకున్నట్టు మున్సిపాల్టీ వారు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితిలేదు. శునకాలు గాయపరుస్తున్నాయని మున్సిపాల్టీకి ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండటంలేదు. గతంలో పాతూరులో మేకల మందపై దాడిచేసి నాలుగింటిని చంపివేశాయి. రోడ్డుపై ఆడుకుంటున్న చిన్నారిని తీవ్రంగా గాయపర్చాయి. బైకుపై వెళ్తున్న వాహనదారుడి వెంట పడటంతో ఆయన కిందపడి గాయాలపాలయ్యారు. బీసీ కాలనీలో వృద్ధురాలిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. శంఖవరంలో మహిళపై దాడిచేశాయి.



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

తాజాగా పట్టణంలోని పాతూరు, మహాలక్ష్మమ్మ చెట్టు వీధిలో శుక్రవారం రాత్రి 30 మందిపై దాడి చేయడంతో ఆస్పత్రులపాలయ్యారు.

వైభవంగా కోదండ రామాలయ ప్రతిష్ఠ



ఆలయంలో కొలువుదీరిన సీతారామ లక్ష్మణ స్వాములు

ముండ్లమూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కాలనీకి చెందిన భక్తులు చందాలు వేసుకొని ఆలయాన్ని రూ.10 లక్షలు వెచ్చించి నిర్మించారు. ఉదయం 8.05 గంటలకు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. 11 గంటల సమయంలో రామాలయంలో సీతారామ లక్ష్మణ స్వాములను ప్రతిష్ఠించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం రామ నామ స్మరణతో మారుమోగింది. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్ఐ త్యాగరాజు

దొనకొండ, మే 3(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ త్యాగరాజు అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే రోడ్డు ప్రమాదాలకు గురవుతారన్నారు. స్థానిక అంబేడ్కర్, ఎన్టీఆర్, రైల్వేస్టేషన్, మండల పరిషత్ కార్యాలయాల కూడళ్ల వద్ద ఆయన ముమ్మరంగా వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు, రోడ్డు భద్రతా నియమాలు ఉల్లఘించిన వారికి ఫెనాల్టీలు వేశారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముండ్లమూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు వద్ద గతనెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన వరగాని శరత్ పాల్(21) ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఆగి ఉన్న లారిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గుంటూరులోని జీజీహెచ్‌లో చేర్పించగా బ్రెయిన్ డెడ్ కావటంతో శనివారం ఉదయం మృతి చెందారు. మృతుడు ఇటీవలే పాల్‌టెక్నిక్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. ఇంతలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. చేతికి అంది వచ్చిన కుమారుడు మృతి చెందటంతో ఆ కుటుంబం రోదిస్తున్న తీరు స్థానికులను కంట తడి పెట్టించింది. మృతుడు తండ్రి ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ పీవీ హనుమంతరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం



ఏఐవైఎఫ్ జండాను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్

పామూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుపర్చడంతో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈసం దర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామిని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు ఆదాయాన్ని చేకూరుస్తుందన్నారు. యువతకు నిరు ద్యోగ భృతిని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సయ్యద్ మౌలాలి, వి.సుబ్బారావు, పి.మస్తాన్‌రావు, ఇర్రి వెంకట్‌రెడ్డి, ఖా జావళి, మల్లికార్జున, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

దర్శి, మే 3(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దర్శి ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దొనకొండలో పరిశ్రమల కారిడార్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ .రామాంజియాదవ్, ఏఐవైఎఫ్ నాయకులు జి శేఖర్, యశ్వంత్, ప్రభుదేవా, రాజేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో పంచాయతీలకు ఆదాయం



వేపగుంపల్లిలో చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్

వీసీపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపదను సమకూర్చి పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలని డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్ అన్నారు. మండలంలోని వేపగుంపల్లిలో గల చెత్తసంపద కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిరోజు గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను సేకరించి చెత్తసంపద కేంద్రాలకు తరలించాలన్నారు. వర్మీ కంపోస్టుతో పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవచ్చునన్నారు.



ఉష్ణోగ్రత (అంచనా)

4-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	40	26
తెనాలి	38	27
నరసరావుపేట	39	26
బాపట్ల	37	27
రెంటచింతల	40	27



నరసరావుపేట మున్సిపల్ బాలుర స్కూల్‌లో అర్ధాంతరంగా నిలిచిన తరగతి గదుల నిర్మాణం

నాడు-నేడు నాస్పుడు

- పాఠశాలల్లో పనులపై నీలినీడలు
- నిలిచిన పనులతో ఏడాదంతా అవస్థలే
- పనుల పూర్తిపై ప్రభుత్వంలో కొరవడిన స్పష్టత
- విద్యా సంవత్సరం ప్రారంభానికైనా పూర్తి చేయాలని వినతి

నిధులు ఇవ్వక.. పనులు సాగక

నాడు-నేడుతో అద్భుతాలు సృష్టిస్తాం. కార్పొరేట్ పాఠశాలల్లో సౌకర్యాలను ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు సమకూరుస్తాం.. అని గత వైసీపీ పాలకులు హడావుడి చేశారు. మొదటి, రెండు విడతలు పేరుతో వేల కోట్లు మంజూరు చేశామని.. వేల పనులు చేపట్టాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే వైసీపీ హయాంలో నిధులు విడుదల కాక.. పనుల సాగలేదు. గత ఏడాది కూటమి ప్రభుత్వం ఆయా పనులు నిలిపేసింది. దీంతో ఏడాదిగా నాడు-నేడు పనులు ముందుకు సాగక అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అనేక పాఠశాలల్లోని తరగతి గదులు నాడు-నేడు సామగ్రితో నిండిపోగా విద్యార్థులకు చెట్ల కింద, వరండాల్లో బోధన చేయాల్సి వచ్చింది. ఏడాది గడిచినా నాడు-నేడు పనులపై ప్రభుత్వంలో స్పష్టత లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పాఠశాలల్లో చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోగా ఆయా పనులపై నీలినీడలు అలుముకున్నాయి. రానున్న విద్యా సంవత్సరం కల్లా తరగతి గదుల పనులు పూర్తి చేసి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాడు నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలు మార్చేశాం.. అన్ని వసతులు కల్పించాం అంటూ గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. అయితే కూటమి ప్రభుత్వంలో అయినా పనులు సాగుతాయనుకుంటే నిరాశే మిగిలింది. ఏడాదిగా ఏ ఒక్క బడిలోనూ ప్రగతి పని ముందడుగు పడలేదు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని ఏడాదంతా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండో విడతలో చేపట్టిన పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆశ అడియాసగానే మారింది. అనేక ఆరోపణల నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను కూటమి ప్రభుత్వం నిలిపేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండో విడతలో 3,138 పాఠశాలల్లో రూ.699.28 కోట్లతో పనులు చేపట్టారు. ఈ నిధులు మంజూరు చేసినట్లు నాడు వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే నిధుల విడుదలలో చతికిలపడింది. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు పనులను నిలిపి వేశాయి. నాడు నేడు పనుల పూర్తిపై గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. నాడు-నేడు పేరుతో అనేక పాఠశాలల్లో ఉన్న తరగతి గదులను కూల్చివేయడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా పాలకుల్లో స్పందన లేకుండా పోయింది. నూతన గదులు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో తరగతిగదుల సమస్య నెలకొంది. ఇకమరుగుదొడ్ల నిర్మాణం సాగక ఏడాదిగా విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక పాఠశాలల్లో

(మిగతా 2వ పేజీలో)



ములకలూరులో పునాదులు దాటని తరగతి గది నిర్మాణం

బీటెక్కే



శిక్షణ.. ప్రైవేటు సెక్టార్‌తో అనుసంధానం

- ఖాళీగానే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు
- 40 శాతం మంది పట్టభద్రులకు పని లేదు
- కొలువుల కోసం ఉన్నత విద్యావంతుల నిరీక్షణ
- ఉపాధి లేని వారిపై ఇంటింటి సర్వే చేసిన ప్రభుత్వం
- మూడు జిల్లాల పరిధిలో 16,91,432 మంది నిరుద్యోగుల గుర్తింపు
- సాంకేతిక విద్యార్థుల్లో 80 శాతం మందికి ఉపాధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బీటెక్ చేసినా ఖాళీగానే ఉంటున్నారు. పేరుకు బీటెక్ చదివినా తగిన ఉద్యోగం లేక ఇంటి పట్టున లేదంటే ఏదో ఒక కోర్సు అభ్యసిస్తూ అనేక మంది ఉంటున్నారు. పీజీతో పాటు పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులు చదివిన వారు కూడా అర్హతకు తగిన కొలువు దొరక్క అల్లాడుతున్నారు. ఇక పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఖాళీగా ఉన్నవారు ఎందరో ఉన్నారు. ప్రభుత్వం ఏదైనా పని చూపితే చేసుకుంటామని ఎదురు చూస్తున్న వారిలో ఎలాంటి విద్యార్హతలు లేని వారు లక్షల్లో ఉన్నారు. లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ మొదలు పెట్టింది. ఉపాధి కల్పనలో భాగంగా ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటి సర్వే చేపట్టి చేయడానికి ఎటువంటి పనిలేకుండా ఖాళీగా ఉన్న వారి వివరాలను సేకరించింది. విద్యార్హతలు, గతంలో ఏమన్నా పని చేసి మానేశారా.. అనే అంశంతో పాటు ఏ రంగంలో శిక్షణ తీసుకుని రాణిస్తారు.. తదితర అంశాలపై సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రభుత్వం డాటా సేకరించింది. ప్రభుత్వం ఉపాధి చూపెడితే ఇంటి వద్ద నుంచే పనిచేయడానికి ఎంతమందికి ఆసక్తి ఉంది అని అంశంపై కూడా ఆరా తీసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 18 నుంచి 50 ఏళ్ల వయసు వారు ప్రామాణికంగా సచివాలయ ఉద్యోగుల చేత ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహించింది. మూడు జిల్లాల పరిధిలో 16,91,432 గుర్తించింది. వీరంతా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని, తోడ్పాటు కోసమే ఎదురుచూస్తున్నారని నివేదికలో సిబ్బంది పొందుపరిచారు. బాపట్ల జిల్లాలో 5,17,823 వ ందిని ఉపాధిలేని వారిని గుర్తించగా, గుంటూరు జిల్లాలో ఇది 5,86,100గా ఉంది. ఇక పల్నాడు జిల్లాకు వచ్చేసరికి అత్యధికంగా 5,87,609 మంది చేయడానికి పని దొరక్క ఖాళీగా ఉండడమో లేక వారి విద్యార్హతలకు తగిన కొలువు దొరక్క ప్రయత్నాల్లోనో ఉన్నట్లు సర్వేలో తేల్చారు. ఖాళీగా ఉన్నవారిలో దాదాపు 40 శాతం మంది పట్టభద్రులే కాగా ఇందులో కూడా బీటెక్ వంటి సాంకేతిక కోర్సులు చేసిన వారే అధికంగా ఉన్నారు. పీజీతో పాటు పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులు చదివిన వారు 15 శాతం మంది ఖాళీగా ఉంటుండగా, గత ప్రభుత్వం ఐదేళ్లలో చేస్తున్న కొలువు కోల్పోయిన వారు 15 శాతం మంది ఉన్నట్లు సర్వేలో తేలింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఖాళీగా ఉన్నవారు, ఎలాంటి విద్యార్హతలు లేకుండా ప్రభుత్వం ఏదన్నా పని చూపిస్తే చేసుకుంటామన్న వారిలో మహిళలే అధికంగా ఉండగా మొత్తం నిరుద్యోగుల్లో వీరిది 30 శాతంగా ఉండడం గమనార్హం. సర్వేలో ఉపాధిలేని వారిగా గుర్తించిన వారిలో 80 శాతం మందికి మూడు నెలల వ్యవధిలోనే కొలువు చూపెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులేస్తోంది.

సర్వేలో భాగంగా వివిధ విభాగాల మీద ఆసక్తి ఉండి ఆర్థిక స్థోమత కారణంగా వాటిని నేర్చుకోలేకపోయామని పలువురు వెల్లడించారు. తొలుత వారందరికీ ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇచ్చే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోనుంది. దీనికి సమాంతరంగా విద్యార్హతలను బట్టి ప్రైవేటు కంపెనీలకు ఉద్యోగార్థులకు అనుసంధానకర్తగా ప్రభుత్వం ఉంటూ వారిని ఉపాధి వైపు నడిపించే కార్యక్రమానికి కసరత్తు మొదలుపెట్టింది. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఇళ్ల వద్దే ఉపాధి కల్పించే మార్గాల అన్వేషణలో యంత్రాంగం ఉంది. ఇంటి వద్దే తయారు చేసే గృహోపకరణాలు, పచ్చళ్లు, తినుబండారాలు, ఆర్గానిక్ ఉత్పత్తులపై అవగాహన వంటివన్నీ మహిళల ఉపాధి కల్పనలో భాగం చేయడానికి ప్రభుత్వం సదరు విభాగాలను సమాయత్తం చేసింది.

సచివాలయాల్లో ఆన్‌లైన్ పరీక్షలు..

సర్వేలో భాగంగా పని లేకుండా ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ పట్టభద్రులపైన ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టింది. తొలుత జిల్లాకు 1000 మంది బీటెక్ గ్రాడ్యుయేట్లకు కొలువులు చూపెట్టే దిశగా కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ప్రభుత్వం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తోంది. ఆన్‌లైన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా వారికి కొలువులు కల్పించే పనిని సదరు కంపెనీలు చేపట్టేలా ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని త్వరలో జిల్లాలోని ఓ వేదికలో మెగా ఆన్‌లైన్ పరీక్షలను చేపట్టి ఒకేసారి వేల మందికి ఉపాధి చూపెట్టేలా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. ఈ క్రమంలో ఆయా కంపెనీలకు తగ్గట్టుగా నిరుద్యోగుల్లో నైపుణ్యాలు లేకపోతే వారే అందుకు సంబంధించిన శిక్షణ ఇచ్చేటట్లు కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.



వేటపాలెం : కొత్తపేట సచివాలయంలో ఆన్‌లైన్ పరీక్షకు హాజరైన బీటెక్ గ్రాడ్యుయేట్ (పాత చిత్రం)

రహదారుల పనులు వేగవంతం చేయాలి

నష్టపరిహారం చెల్లింపులు తక్షణమే చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఓడరేవు- నకిరేకల్, బెంగళూరు-కడప- విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ పనులపై రెవెన్యూ అధికారులతో శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన సమీక్షించారు. 167-ఏ నిర్మాణంలో కారంచేడు, పర్చూరు, వేటపాలెం, చీరాల మండలాల్లో భూసేకరణ సమస్యలను పరిష్కరించాలన్నారు. భూములు కోల్పోయినవారికి పరిహారం చెల్లించాలన్నారు. చీరాల మండలంలోని ప్రభుత్వ పోరంబోకులో నివాసం ఉంటున్న 63 గృహాల నిర్మాణాలను తక్షణమే తొలగించాలన్నారు. జాతీయ రహదారి 544-జీ నిర్మాణానికి ఆటంకంగా ఉన్న భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. జెపంగులూరు మండలంలో ప్రజల అభ్యంతరాలను పరిగణంలోకి తీసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. అద్దంకిలో ఆక్రమణలను తొలగించాలన్నారు. 16వ నెంబరు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పిచ్చుకలగడిపాడు వద్ద సర్వీస్‌రోడ్డు నిర్మాణం కొరకు భూసేకరణ త్వరగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్‌డీసీ లవన్న, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగం పర్యవేక్షకులు సంధ్యారాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

రూ.కోట్లతో జీజీహెచ్‌లో సౌకర్యాలు

రూ.86 కోట్ల ఎంసీహెచ్ బ్లాక్ ఈ ఏడాది చివరికి పూర్తి ● స్టెప్‌డౌన్ ఐసీయూ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు మెడికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్‌లో పదినెలల కూటమి ప్రభుత్వం హయాంలో రూ.కోట్లాది వైద్య పరికరాలు సమకూరాయని, సీటీ స్కాన్లు, లిఫ్టులు మరమ్మతులు చేయించామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అత్యవసర వైద్య విభాగానికి అనుబంధంగా 15 పడకలతో నూతనంగా నిర్మించిన స్టెప్‌డౌన్ ఐసీయూను మంత్రి ప్రారంభించారు. ప్రభుత్వాస్పత్రి కోసం నూతనంగా రూపొందించిన లోగోను మంత్రి ఆవిష్కరించారు. జీఎంసీ 80వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రామారావు, శారద ఇంకుడుగుంతల నిర్మాణానికి రూ.9 లక్షల విరాళం మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ పారిశ్రామికవేత్త తులసీ రామచంద్ర ప్రభు అందజేసిన రూ.10 కోట్ల విరాళంతో వారంలో పనులు ప్రారంభిస్తామన్నారు. సీఎస్ఆర్ కింద వచ్చిన రూ.15 కోట్లతో కూడా మరికొన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఐసీయూకు రూ.1.60 కోట్ల విలువైన నాలుగు పీడియాట్రిక్ వెంటిలేటర్లు, ఆరు మొబైల్ వెంటిలేటర్లను విరాళంగా అందజేసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు ఏసీలు, పడకలు అందజేసిన దాతలను పెమ్మసాని అభినందించారు. దాతలు, పారిశ్రామికవేత్తలతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నాట్కో వంటి కార్పొరేట్ కంపెనీలు జీజీహెచ్‌ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జీజీహెచ్‌లో కొత్తగా ప్రారంభించిన స్టెప్‌డౌన్ ఐసీయూతో మరో 15 పడకలు అదనంగా అందుబాట్లోకి వస్తున్నాయని తెలిపారు. పూర్వ విద్యార్థుల వితరణతో ఆస్పత్రి ఆవరణలో రూ.86 కోట్లతో చేపట్టిన ఎంసీహెచ్ బ్లాక్ పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతాయని ప్రకటించారు.



ఆసుపత్రి లోగోను ఆవిష్కరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

పది నెలల్లో పెరిగిన విశ్వాసం

సాయం చేసేందుకు పలువురు దాతలు సిద్ధంగా ఉన్నా గత వైసీపీ అసమర్థత చూసి ఎవరూ ముందుకు రాలేదని పెమ్మసాని తెలిపారు. పది నెలల స్వల్ప కాలంలోనే కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని, దీంతో ఎందరో దాతలు ముందుకు వచ్చి గుంటూరు జీజీహెచ్‌లో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. జీజీహెచ్‌లో ఏనాడైనా వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులను చేపట్టిందా అని కేంద్ర మంత్రి నిలదీశారు. పదినెలల కూటమి ప్రభుత్వం హయాంలో రూ.కోట్లాది వైద్య పరికరాలు సమకూరాయని, సీటీ స్కాన్లు, లిఫ్టులు మరమ్మతులు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, భాష్యం రామకృష్ణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఎండతో అస్వస్థత.. ఇద్దరు కూలీల మృతి

1 చెన్నుపల్లి, ముక్తేశ్వరంలో అలుముకున్న విషాదం

బల్లికురవ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపల్లి, ముక్తేశ్వరం గ్రామాలలో శనివారం ఉదయం ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లి ఇద్దరు కూలీలు మృతి చెందారు. ఆయా గ్రామాలకు చెందిన షేక్ జాను(45) మాసాని మల్లికార్జునరావు(23) ఎండ వేడిమితో అస్వస్థతకు గురై మృతి చెందారు. అందిన సమాచారం మేరకు చెన్నుపల్లి గ్రామానికి చెందిన జాను కుమార్తెతో కలిసి పనులకు వెళ్లగా ఉక్కపోత ఎండ వేడిమితో పనుల వద్దే ఊపిరి ఆడక కుప్పకులి పడిపోయాడు. తోటి కూలీలు గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇరువురు కుమార్తెలు ఉన్నారు. అదేవిధంగా ముక్తేశ్వరం గ్రామానికి చెందిన మాసాని మల్లికార్జునరావు రోజు మాదిరిగానే ఉపాధి పనులకు వెళ్లి అస్వస్థతకు గురై ఫిట్స్ వచ్చాయి. దీంతో పనుల వద్దే మృతి చెందాడు. ఇతడికి వివాహం కాలేదు. రెండు గ్రామాల్లో ఇద్దరు మృతి చెందడంతో కూలీలు బెంబేలెత్తి పోతున్నారు. అధికారులు పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించడం లేదని కనీసం నీడ, నీరు, ప్రథమచికిత్స కిట్లను కూడా అందుబాటులోకి తేవడం లేదని కూలీలు వాపోతున్నారు. గత నెలలో కూడా కొండాయపాలెంలో ఓ కూలీ పనులు చేస్తు మృతి చెందిన విషయం విదితమే.



మృతుడు షేక్ జాను



మృతుడు మల్లికార్జునరావు

చిన్నబోతోన్న.. లక్ష్యం

1 ధాన్యం సేకరణపై ప్రతిపాదనల పరంపర
1 అదనపు అనుమతులపై అన్నదాతలు ఆశలు
1 రబీలో 30,000 టన్నులకు ఇప్పటికే 20,160 టన్నుల సేకరణ 1 మరో 20,000 టన్నుల సేకరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
1 జీపీఎస్ విషయంలో కొనసాగుతున్న గందరగోళం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గడచిన ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు తొలుత ఇచ్చిన లక్ష్యం చాలక దఫదఫాలుగా యంత్రాంగం ప్రతిపాదనలు పంపడం వాటికి ఆమోదం లభించడంతో రికార్డు స్థాయిలో 91,000 టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయిస్ విభాగం సేకరించగలిగింది. ఇప్పుడు రబీ సీజన్‌లో కూడా అదే పరిస్థితి నెలకొనే సూచనలే కనబడుతున్నాయి. ఈ సీజన్‌కు సంబంధించి తొలుత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు 10,000 టన్నులే కాగా, దిగుబడులకు దీనికి హస్తిమశకాంతరం తేడా ఉండడంతో దానిని 30,000 టన్నుల వరకు పెంచారు. దీంతో ఆ ధాన్యం కూడా పెద్దఎత్తున కొనుగోలు కేంద్రాల బాట పట్టడంతో ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం చిన్నబోయింది. కొనుగోలు కేంద్రాల తెరవక ముందే సేకరణ లక్ష్యం పెంచుకోవడంలో యంత్రాంగం విజయం సాధించింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరంభంలో మందకొడిగా సాగిన ధాన్యం సేకరణ ప్రస్తుతం ఊపందుకుంది. దీంతో ఇప్పటికే కొనుగోలు కేంద్రాల ద్వారా 20,160 టన్నుల ధాన్యం సేకరించారు. దీనికి సంబంధించి రూ.38 కోట్లు అన్నదాతల ఖాతాల్లో జమ చేశారు. మరోవైపు ఇంకా దాదాపు 60,000 టన్నుల ధాన్యం రైతుల వద్దే ఉన్నట్లు తెలుస్తోంది. మరో వారం రోజుల్లోనే ప్రభుత్వం ఇచ్చిన 30,000 టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరో 20,000 టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు ఇవ్వాల్సిందిగా సివిల్ సప్లయిస్ విభాగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. అదనంగా ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే గాని రైతులు ఒడ్డున పడే సూచనలు కనబడడం లేదు.



దిగుబడులు 1,08,000 టన్నులు..

రబీ సీజన్‌తో పాటు లేట్ ఖరీఫ్ దిగుబడులు కలుపుకుంటే మొత్తం 1,08,000 టన్నుల వరకు ధాన్యం దిగుబడులు వచ్చాయి. సీజన్ ఆరంభంలో కేవలం రబీ సీజన్ దిగుబడులనే ప్రామాణికంగా తీసుకుని కేవలం 10,000 టన్నుల సేకరణకే ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కానీ లెఫ్ట్ ఓవర్ ఖరీఫ్‌ను రబీకిందే సేకరించాల్సి వస్తుందని మరింతగా అనుమతులు ఇవ్వాలనే జిల్లా అధికారుల అభ్యర్థన మేరకు లక్ష్యాన్ని 30,000 వరకు పెంచారు. సీజన్ ఆరంభం నుంచి లేట్ ఖరీఫ్ ధాన్యం విషయంలో తకరారు నడుస్తూనే ఉంది. దానిని ఈ క్రాప్‌లో ఖరీఫ్ కింద నమోదు చేయడంతో రబీ కింద సేకరించాలంటే సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. దీనికి సంబంధించి రాష్ట్రస్థాయిలో లెటర్ పెట్టి సమస్య పరిష్కరించారు. ప్రస్తుతం సేకరించిన 20,160 టన్నుల ధాన్యంలో లేట్ ఖరీఫ్‌దే దాదాపు 15,000 టన్నులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా 60,000 టన్నుల ధాన్యం అన్నదాతల వద్దే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యంలో మరో 9,840 టన్నులు మాత్రమే మిగిలిఉంది. అదనపు అనుమతు లపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. మద్దతు ధర కన్నా బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు ధాన్యం ధర రూ.300 వరకు తక్కువగా ఉంది. ప్రభుత్వం సేకరణలో పెంపునకు అనుమతులు ఇవ్వకపోతే బహిరంగ మార్కెట్‌లో అయిన కాడికి అమ్ముకుని అన్నదాతలు భారీగా నష్టపోయే అవకాశం ఉంది

ప్రతిబంధకంగా జీపీఎస్..

ధాన్యం రవాణాకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానం రైతులను ఇంకా గందరగోళానికి గురిచేస్తూనే ఉంది. ధాన్యాన్ని కల్లాల నుంచి మిల్లులకు తరలించే వరకు ఈ వ్యవస్థ పనిచేయనుంది. రవాణాకు తీసుకున్న సమయంతో పాటు కిలోమీటర్లు ఇవన్నీ కూడా పక్కాగా నమోదు కానున్నాయి. ధాన్యం సేకరణలో అవకతవకలను అరికట్టడానికి తీసుకొచ్చిన ఈ విధానంలో క్షేత్రస్థాయి ఇబ్బందులపై దృష్టిపెట్టలేదని తెలుస్తోంది. ధాన్యాన్ని కొందరు రైతులు ఇంట్లో, గోదాముల్లోనో నిల్వ చేసుకుని ఉంటారు. కానీ జీపీఎస్ అనేది నేరగా కల్లాల నుంచే చూపెట్టాలంటే ఎలా అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

అవీ.. ఇవీ..

నీట్ - 2025 పరీక్షపై అప్రమత్తం

- అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సమావేశం
- పరీక్షకు హాజరుకానున్న 416 మంది విద్యార్థులు



పరీక్ష నిర్వహణపై సమీక్షిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్

చీరాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో జరిగే నీట్ - 2025 పరీక్షపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. నేడు స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నీట్ పరీక్షలు జరుగనున్నాయి. అందుకు సంబంధించి వివిధ ప్రాంతాల నుంచి 416 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఈనేపథ్యంలో శనివారం ఆర్డీవో ఆయన కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్షకేంద్రంలోకి అనుమతిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 1:30.ని సమయంలో గేట్లు మూసివేయనున్నట్లు వివరించారు. అయితే పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ తప్పనిసరిగా సూచించారు. అలాగే మూడు పేజీల సెల్ఫ్ డిక్లరేషన్, అందులోని రెండో పేజీలో పోస్ట్ కార్డు సైజ్ పాస్ ఫోటో అంటించి ఉండాలన్నారు. అలాగే పరీక్షకు హాజరయ్యే వారికి ఎటువంటిసౌకర్యం కలుగకుండా తగు సూచనలు చేశారు. విద్యార్థులు హెల్ప్ డెస్క్ 9948026554, 7569721099, 7032111794, 7416168278 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో కే.పద్మావతి, తహసీల్దార్ గోపీకృష్ణ, సీఐలు సుబ్బారావు, నాగభూషణం, పలువురు ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పాత రికార్డుల కంప్యూటరీకరణ

- శింగరకొండలో 55 ఏళ్ల నుంచి రికార్డుల కంప్యూటరీకరణ



రికార్డులు కంప్యూటరీకరిస్తున్న సిబ్బంది

అద్దంకి, మే3 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పాతరికార్డులు కంప్యూటరీకరణ పనులు జరుగుతున్నాయి. రికార్డులు చినిగిపోయి భవిష్యత్‌లో సమాచారం అందుబాటులో ఉండే అవకాశం లేకపోవడంతో ఆ సమాచారం మొత్తాన్ని సంవత్సరాల వారీగా కంప్యూటరీకరణ చేస్తున్నట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. 1970 సంవత్సరం నుంచి అందుబాటులో ఉన్న వివాహం, శాశ్వత అభిషేకము, శాశ్వత ఆకుపూజలు, శాశ్వత అన్నదానంకు విరాళాలు ఇచ్చిన భక్తుల వివరాలను రసీదుల ఆధారంగా నమోదు చేస్తున్నారు. ప్రతి సంవత్సరానికి ప్రత్యేక ఫోల్డర్ ఏర్పాటు చేసి, వివరాలతో పాటు సంబంధిత రసీదులు కూడా స్కాన్ చేసి భద్రపరుస్తున్నట్లు తెలిపారు. గత 20 రోజులుగా 12 మంది కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువతీయువకలను కేటాయించి కంప్యూటరీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.7వేల రసీదులు కంప్యూటీకరణ చేసినట్లు తెలిపారు. భక్తులు ఎప్పుడు వచ్చి సమాచారం అడిగినా రికార్డుల ఆధారంగా అందజేసేందుకు వీలు కలుగుతుందన్నారు. ప్రధానంగా వివాహ సర్టిఫికేట్‌లు, దాతల వివరాలు గుర్తించేందుకు మరింత వీలు కలుగుతుందని ఈఓ తిమ్మానాయుడు తెలిపారు.

ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠమహోత్సవం



ప్రత్యేక అలకరణలో నవగ్రహాలు

అద్దంకిటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుకొమ్ము పాలెంలో కాశీవిశ్వేరస్వామి ఆలయంలో ఆదిత్యాది నవగ్రహ ప్రతిష్ఠమహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు దంపతులు హోమంలో, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిష్ఠ మహోత్సవానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

అర్ధంతరంగా నిలిచిన ఎత్తిపోతల పథకం

- వైసీపీ ప్రభుత్వంలో చెల్లింపులు లేక నిలిచిన పనులు
- మంత్రి రవికుమార్ చొరవతో తిరిగి ప్రారంభంకానున్న పనులు

అద్దంకి, మే3 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతో ఆశగా ఎదురుచూసిన ఉప్పలపాడు ఎత్తిపోతల పథకానికి నాటి వైసీపీ ప్రభుత్వ నీళ్ల చల్లింది. సాగునీటి రంగంపై నిర్లక్ష్యంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆరేళ్లగా బిల్లులు చెల్లింపు లేక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అద్దంకి మండలంలోని ఉప్పలపాడు, మైలవరం గ్రామాల పరిధిలోని సుమారు 2500 ఎకరాల ఆయకట్టు భూములతో పాటు రెండు గ్రామాల చెరువులకు నీరు నింపే విధంగా సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఉప్పలపాడు ఎత్తిపోతల పథకం రూపకల్పన చేశారు. గుండ్లకమ్మ నది నుంచి సుమారు 2.750 కి.మీ దూరం మెయిన్ పైప్ లైన్ ఏర్పాటు చేసి అక్కడ నుండి రెండు వైపులా సబ్‌పైప్‌లైన్లు ఏర్పాటు ద్వారా పొలాలకు సాగునీరు, చెరువులు నింపేందుకు నీరు విడుదల చేసే విధంగా చేశారు. గుండ్లకమ్మ నదిలో ఇన్‌టెక్‌వెల్ నిర్మాణం, సుమారు 2 కి.మీ దూరం మెయిన్ పైపులైన్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ప్రధానంగా మిగిలిపోయిన 750 మీటర్ల మెయిన్ పైప్‌లైన్, సబ్‌పైప్‌లైన్లు, మోటార్లు, మోటార్ల పంప్‌హౌస్ ఏర్పాటు చేయాల్సి ఉంది. గత టీడీపీ హయాంలో 2018లో పనులు ప్రారంభం కాగా కొద్దినెలలకే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బిల్లులు చెల్లింపులు ఆగిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో బిల్లుల చెల్లింపు చేయలేదు. దీంతో పనులు పునఃప్రారంభం కాలేదు. అదేసమయంలో గుండ్లకమ్మనదిలో బావి నిర్మాణం వద్ద ఉన్న జనరేటర్, ఇతర నిర్మాణ సామగ్రి కూడా చోరీకి గురయ్యింది. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాగు నీటిరంగానికి ప్రాధాన్యం ఇవ్వడంతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల ఐడీసీ అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లుల చెల్లింపుతో పాటు మిగిలిన పనులకు సంబంధించి వ్యయం పెరిగినందు న మరోసారి అంచనాలు రూపొందించాలని కాంట్రా క్టర్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో అంచ నాలు తయారు చేసి అందజేస్తే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి రవికుమార్ హామీ ఇచ్చారు. దీంతో అంచనాలు తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. త్వరలో ఎత్తి పోతల పథకం పనులు ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తుండటంతో రెండు గ్రామాల రైతులలో ఆశలు చిగురించాయి. రెండు గ్రామాల పొలాలు సాగర్ ఆయకట్టు చివరి భూములు కావడంతో చెరువులకు నీరు నింపాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పలపాడు ఎత్తిపోతల పథకం వచ్చే వ్యవసాయ సీజన్‌కు పనులు పూర్తయితే 2500 ఎకరాలకు సాగు నీటివసతి, రెండు చెరువులకు నీటిసమస్య తీరే అవకాశం ఉందని రైతులు అభి ప్రాయపడుతున్నారు.



నీరు తక్కువగా ఉన్న మైలవరం చెరువు



నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం పైపులు

అద్దంకివాసులకు ఎన్‌టీఆర్ జాతీయ పురస్కారాలు



అవార్డులు అందుకుంటున్న మన్నం త్రిమూర్తులు, నాగినేని రామకృష్ణ, పెద్దినేని సురేంద్ర

అద్దంకి, మే3(ఆంధ్రజ్యోతి):డాక్టర్ ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలు సందర్భంగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ, రాజమహేంద్రవరం పాన్‌ఇండియాల ఆధ్వర్యంలో విజయవాడలో శనివారం నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ జాతీయ పురస్కారాల కార్యక్రమంలో అద్దంకికి చెందిన ముగ్గురు వ్యక్తులు అవార్డులు అందుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ విభాగాలకు చెందిన 26 మంది డాక్టర్ ఎన్‌టీఆర్ జాతీయ పురస్కారాలు అంద జేయగా కళారంగం నుంచి అద్దంకికి చెందిన నందమూరి కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, రాజకీయరంగం నుండి బాపట్ల జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, సేవా రంగం నుండి చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ పెద్దినేని సురేంద్రలు ఉన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అద్దంకి రాజా, దూండీ రాకేష్, చప్పి డి రాజశేఖర్ తదితరుల చేతుల మీదుగా డాక్టర్ ఎన్టీఆర్ జాతీయ పురస్కా రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గురికి అద్దంకికి చెందిన పలు సాహితీ సంస్థల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు దుర్మరణం

- విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమంటూ ఆరోపణలు
- స్తంభంపైనే అరగంటపాటు మృతదేహం

పేరాల(చీరాల), మే 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ పనులు చేస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ ప్రమాదవశాత్తు స్తంభంపై నుంచి కిందపడి అక్కడిక్కడే మృతి చెంది, తీగలకు వేలాడాడు. ఈ హృదయ విదారక ఘటన శనివారం పేరాల జక్కావారివీధిలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం మండల పరిధిలోని విజయనగర్ కాలనీకు చెందిన జడ సునీల్(25) ప్రైవేట్ ఎలక్ట్రిషియన్. ఈక్రమంలోనే సహచరులతో కలిసి శనివారం పని చేస్తున్న సమయంలో తీగలకు విద్యుత్ సరఫరా జరి గింది. దీంతో మృతి చెంది తీగల పైనే సుమారు అరగంట పాటు వేలాడాడు. దీంతో స్థానికులు, సహచరులు శ్రమించి మృతదేహా న్ని తాడు సహాయంతో క్రిందకు దించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి వ్యవసాయ కూలీ తల్లిదండ్రులు, ప్రయివేట్ వర్కర్‌గా పని చేస్తున్న సోదరుడు ఉన్నారు.



మృతదేహాన్ని కిందకు దింపుతున్న సిబ్బంది

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- వజ్రాలవేట, కుటుంబఖర్చుల కోసం అప్పులు
- చికిత్స పొందుతూ మృతి

అద్దంకి, మే3 (ఆంధ్రజ్యోతి): వజ్రాలు, రంగురాళ్లవేట, కుటుంబ ఖర్చులకు అప్పులు చేసింది. తీర్చేమార్గం లేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డ తన్నీరు అంజయ్య(54) చికిత్స పొందుతూ శనివారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అద్దంకి మండలంలోని కొత్తరెడ్డిపాలేనికి చెందిన తన్నీరు అంజయ్య రంగురాళ్ళు, వజ్రాల వేటకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో కుటుంబఖర్చులకు అప్పులు చేశాడు. దీంతో గత నెల 29న గ్రామానికి సమీపంలో వెంకటేశ్వరరెడ్డి పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గమనించి వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అంజయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- మోటారుసైకిళ్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఘటన

అద్దంకి, మే3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపురానికి చెందిన ఇరువురు యువకులు మోటార్‌సైకిళ్లపై ఎదురెదురు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు శనివారం రాత్రి గోపాలపురానికి చెందిన కె.లింకన్ మోటార్‌సైకిల్‌పై చక్రాయపాలెం వైపు నుంచి గోపాలపురంలోకి వస్తున్నాడు. అదేగ్రామానికి చెందిన యర్రా హర్ష మోటార్‌సైకిల్‌పై వెళ్తుండటంతో ఎదురెదురు ఢీ కొన్నాయి. దీంతో హర్ష ప్రైవేట్ వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా, లింకన్‌ను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చెట్టును ఢీకొన్న కారు



చెట్టును ఢీకొన్న కారు

సంతమాగులూరు మే 3 (ఆంధ్రజ్యోతి) అద్దంకి నార్కెట్ పల్లిహైవేపై అతివేగంగా వస్తున్న కారు ఏల్చూరు వద్దకు రాగానే ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాదు నుండి ఒంగోలు వెళ్తున్న కారు గ్రామంలోకి రాగానే అదుపుతప్పి చెట్టును ఢీ కొన్నది, కారులో ఉన్న ప్రయాణికులకు గాయాలుకావడంతో క్షేత్రగాతులను నరసరావుపేట జనరల్ హాస్పిటల్ తరలించారు

గోవుల పరిరక్షణ అందరి బాధ్యత

చీరాల గోపరిరక్షణ సమితి ప్రతినిధులు



నీటితొట్టెలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

చీరాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : మూగజీవులు గోవుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని చీరాల గోపరిరక్షణ సమితి ప్రతినిధులు అన్నారు. వేసవి ఎండలు కారణంగా పట్టణంలో తాగునీటికి గోవులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈక్రమంలో రెండు రోజులుగా పట్టణంలోని పలు ప్రధాన రహదారులు వెంబడి సమితి ఆధ్వర్యంలో నీటితొట్టెలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శబరి, బాలాజీ, రవిబాబు, శెట్టి, తారక రామారావు, శ్రీనివాస్, శంకరనారాయణ పాల్గొన్నారు.

పావులూరు తిరునాళ్లకు ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

ఇంకొల్లు,మే 3,(ఆంధ్రజ్యోతి) భక్తుల కొంగుబంగారంగా భావించే మండలంలోని ప్రసిద్ధి గాంచిన పావులూరు ఆంజనేయస్వామి తిరునాళ్ల ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభించారు. వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బం దులు తలెత్తకుండా ఉండేవిధంగా ఆలయకమిటీ వారు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో తాటాకు చలువ పందిళ్లు వేస్తున్నారు. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా ఆంజనేయస్వామి తిరునాళ్ల నిర్వహించేందుకు పనులు జరుగుతున్నాయి. శనివారం భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేసవి సెలవులు కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఫలించిన ఎమ్మెల్యే ఏలూరి కృషి

- పొగాకు కొనుగోలుకు కంట్రోల్ రూపం ఏర్పాటు
- నలుగురు అధికారులతో విక్రయాలపై పర్యవేక్షణ
- ప్రతిరోజు కొనుగోలు తీరును పర్యవేక్షించనున్న అధికారులు



మంత్రి, రైతు సంఘాల నేతలతో ఏలూరి(ఫైల్)

పర్చూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు రైతుల సమస్యలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషి ఎట్టకేలకు ఫలించింది. పొగాకు కొనుగోలుపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ డైరెక్టర్ ఎస్ డిల్లీరావు ఆదేశాలు జారీచేశారు. బర్లీ పొగాకు కొనుగోలుపై పర్యవేక్షణ విక్రయాల తీరు తదితర అంశాలపై కంట్రోల్ రూం పనిచేస్తోంది. బర్లీ పొగాకు రైతుల సమస్యను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకుపోయారు. దీనికి స్పందించిన ప్రభుత్వం గత నెల 29న ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు రైతులు, రైతుసంఘాలు, పొగాకు కంపెనీల ప్రతినిధులతో మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. దీనికి తక్షణం స్పందించిన ప్రభుత్వం గుంటూరులోని పొగాకుబోర్డు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. దీనిలో పొగాకు, వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులతో మోనిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. గుంటూరు అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రమేష్, అగ్రికల్చర్ మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి జ్యోతి, టొబాకో ఫీల్డ్ ఆఫీసర్ ఎ.వంశీకృష్ణ, ఇండియన్ టొబాకో అసోషియేషన్ సభ్యుడు ఎన్.శ్రీనివాసరావులతో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో పొగాకు రోజువారీ విక్రయాలను పర్యవేక్షించనున్నారు. బర్లీ పొగాకు కొనుగోలు చేసిన వివిధ పొగాకు కంపెనీల నుంచి అధికారుల కమిటీ ప్రతిరోజూ సమాచారాన్ని సేకరించి, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రతి రోజూ సాయంత్రం 6గంటలకు నివేదికను అందజేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

యద్దనపూడి,(మార్టూరు)మే3(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతిచెందిన ఘటన శనివారం మార్టూరు నుంచి గన్నవరం రోడ్డులో బొబ్బేపల్లి దండుదారి సమీపంలో చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రత్నకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన బట్టు రవికృష్ణ (38) సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అసోంలో ఉద్యోగం చేస్తూ సెలవు పెట్టి వారంరోజుల క్రితం స్వగ్రామమైన పూనూరులో ఇంటికి వచ్చారు. పూనూరు గ్రామం నుంచి స్కూటీపై మార్టూరు వస్తున్న రవికృష్ణ స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. దీంతో ఆయన తల రోడ్డును తాకి తీవ్రగాయమైంది. దీంతో ఆయన ఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఎస్సై రత్నకుమారి ఘటనా స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా రవికృష్ణకు బల్లికురవ మండలం అంబడిపూడి గ్రామానికి చెందిన అనూషతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు దేవాన్ష్ వేద్‌రిక్వేద్‌లు ఉన్నారు. చిన్నకుమారుడు వేద్‌రిక్వేద్ మార్టూరులోని ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. పెద్దకుమారుడు దేవాన్ష్‌ను రోజూ ఆన్‌లైన్ తరగతుల కోసం రవికృష్ణ స్కూటీపై ఉదయం మార్టూరు తీసుకొచ్చి వదిలిపెడుతుంటాడు. అదేవిధంగా సాయంత్రం మార్టూరు వెళ్లి కుమారుని తీసుకువస్తుంటాడు. దీనిలో భాగంగా శనివారం ఉదయం మార్టూరులోని స్కూల్లో కుమారుడిని వదిలిపెట్టి వెళ్లి, సాయంత్రం ఇంటికి తీసుకొని వెళ్లడానికి పూనూరు నుంచి రవికృష్ణ మార్టూరు వస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదం చోటుచేసుకొందని ఎస్సై తెలిపారు.

ఉపాధి కూలీలకు పారదర్శకంగా సౌకర్యాలు

- అసిస్టెంట్ ప్రాజెక్టు డైరక్టర్ కోటయ్య నాయక్

చీరాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు పారదర్శకంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలు అందించాలని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరక్టర్ కోటయ్య నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మస్టర్ల పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో దాసు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

మారుతీభవన్ మరమ్మతుకు విరాళం



చెక్కును అందజేస్తున్న ఏడుకొండలు

అద్దంకి, మే3(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి ముఖమండపం పునర్ని ర్మాణం కోసం ముండ్లమూరు మండలం శంకరాపురా నికి చెందిన కూరపాటి ఏడుకొండలు, కోటేశ్వరమ్మ దంపతులు రూ.1,01,116, శింగరకొండ పాలెంకు చెందిన సురభి జకరయ్య రూ.10,116లను ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. మారుతీభవన్ గదుల మరమ్మతులకు సంబం దించి అద్దంకి పట్టణానికి చెందిన దామా హనుమంతరావు,జయలక్ష్మి దంపతులు, నుసుం పెద్దిరెడ్డి, విజయలక్ష్మి దంపతులు అవసరమైన సామగ్రి అందజేశారు.

హక్కులపై అవగాహనతో ప్రజాప్రయోజనం

చీరాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : మానవహక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయాధికారి సుధ అన్నారు. శనివారం ఓ ప్రైవేటు వ్యాపార సంస్థలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికహక్కులపై అవగాహన కల్పించారు. స్త్రీలకు ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయని ఇబ్బందికర పరిస్థితులలో వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్‌బాబు, స్నేహ, రామకృష్ణారెడ్డి, శివయ్య, మతీన్‌పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై పలువురు దాడి

- రూ.30 వేలు అపహరణ

ఈపూరుపాలెం(చీరాల), మే 3 (ఆంధ్రజ్యోతి) : మద్యంమత్తులో పలువురు ఓ వ్యక్తిపై దాడిచేసి రూ.30 వేలు నగదు అపహరించారు. ఈ ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బోయినవారిపాలేనికి చెందిన గోనబోయిన చిరంజీవి ఇటీవల చెరుకు వ్యాపారం చేసుకుని సంబంధిత నగదుతో గత గురువారం రాత్రి తోటవారిపాలెం మూడు రోడ్ల కూడలి నుంచి ఇంటికి వెళుతున్నాడు. ఈక్రమంలో పలువురు గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి గొడవ పడ్డారు. అలాగే అతని వద్ద రూ.30వేలు నగదు అపహరించి దాడిచేశారు. దీంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందాడు. ఈ మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.


నాడు - నేడు.. నాన్చుడు

(5వ పేజీ తరువాయి)

విద్యుత్, తాగునీటి వసతి, పర్నిచర్, మేజర్, మైనర్ మరమ్మతులు, తరగతి గదులు, ప్రహరీలు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్‌లు. భవనాలకు రంగులు తదితర పనులు అరకొరగానే సాగగా పెండింగ్ పనుల ఊసే లేకుండా ఏడాది ముగిసింది. ప్రస్తుతం వేసవి సెలవుల దృష్ట్యా పనులపై ప్రభుత్వం స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

అరకొరగానే పనులు పూర్తి..

- పల్నాడు జిల్లాలో 1298 పాఠశాలల్లో రూ.312 కోట్లు వ్యయ అంచనాతో 8,330 పనులు చేపట్టాలని నిర్ణయించారు. 175 ప్యాకేజీల కింద 759 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 26 ప్యాకేజీల్లో మాత్రమే నిర్మాణాలు జరిగాయి. 547 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణం, ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 352 పాఠశాలల్లో మాత్రమే పూర్తి చేశారు. 91 పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాల్సి ఉండగా 29 మాత్రమే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 553 పనులు చేపట్టగా 458 మాత్రమే పూర్తయ్యాయి. 913 మరమ్మతుల పనులకు 284 పూర్తి చేశారు.
- గుంటూరు జిల్లాలో 919 బడుల్లో రూ.203.94 కోట్ల వ్యయ అంచనాతో 6,523 పనులు చేపట్టాలని నిర్ణయించారు. 75 పాఠశాలల్లో 58 ప్యాకేజీల్లో 253 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పది ప్యాకేజీల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. 394 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 237 పాఠశాలల్లో మాత్రమే పూర్తయ్యాయి. 100 పాఠశాలల్లో ప్రహరీలకు 25 బడుల్లో మాత్రమే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 397 పనులు చేపట్టగా 264 పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టగా 191 పూర్తి చేశారు.
- బాపట్ల జిల్లాలో 944 స్కూల్స్‌లో 183.31 కోట్ల వ్యయ అంచనాతో 6,274 చేపట్టాలని నిర్ణయించారు. 112 స్కూల్స్‌లో 96 ప్యాకేజీల్లో 279 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 16 ప్యాకేజీల్లో మాత్రమే పూర్తి చేశారు. 326 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌లను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 163 చోట్ల పూర్తి చేశారు. 78 పాఠశాలలకు ప్రహరీలు మంజూరు కాగా తొమ్మిది మాత్రమే పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా కోసం 327 పనులు చేపట్టగా 215, మరమ్మతుల పనులు 586 చేపట్టగా 157 మాత్రమే పూర్తి చేశారు.



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	40.1	29.0
కావలి	37	29
ఆత్మకూరు	40	29
ఉదయగిరి	39	28
కందుకూరు	37	29


నిర్వహణకు నీళ్లొదిలారా !?

- రూ.500 కోట్లతో నిర్మించిన బ్యారేజీలు గాలికి..
- సంగం, నెల్లూరు బ్యారేజీల వద్ద టెక్నికల్ సిబ్బంది కొరత
- గేట్లు ఆపరేట్ చేయలేక ఇరిగేషన్ అధికారుల అవస్థలు
- ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపినా రాని అనుమతులు

సోమశిల, కండలేరు జలాశయాలు జిల్లాకు ఎంతటి జీవనాడి వంటివో.. సంగం, నెల్లూరు బ్యారేజీలు కూడా అంతే. ఆ రెండు జలాశయాలు నీటిని నిల్వ చేస్తే, ఈ రెండు బ్యారేజీలు ఆ నీటిని కాలువలకు మళ్లిస్తూ సాగులో కీలకంగా ఉంటాయి. ఇంతటి ప్రాధాన్యం గల బ్యారేజీలను దాదాపు రూ.500 కోట్లతో నిర్మించారు. అయితే నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. నాడు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి ముందుచూపు లేకుండా పనులు పూర్తికాకుండా బ్యారేజీలను ప్రారంభించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అదే నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

నెల్లూరు బ్యారేజీ





సంగం బ్యారేజీ

ఎక్కడైనా బ్యారేజీలు ప్రారంభిస్తే దాని నిర్వహణ చాలా ముఖ్యం. కానీ సంగం, నెల్లూరు బ్యారేజీల విషయంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రెండు బ్యారేజీలను దాదాపు రూ.500 కోట్లతో నిర్మించినా ఆ బ్యారేజీలను నిర్వహించేందుకు మాత్రం సిబ్బంది లేకుండాపోయారు. నిర్మాణ సంస్థలకు ఇంకా మెయింటెనెన్స్ పీరియడ్ ఉంది కదా..అని ఉన్నతాధికారులు మొదట నెట్టుకొచ్చారు. అయితే ఆ సంస్థలకు బిల్లులు చెల్లించక పోవడంతో మెయింటెనెన్స్‌ను పట్టించుకోలేదు. నెల్లూరు బ్యారేజీకి సంబంధించి కాంట్రాక్టర్‌కు నిర్వహణ పీరియడ్ పూర్తి కాగా , ఒకటి, రెండు నెలల్లో సంగం బ్యారేజీ నిర్వహణ కాలపరిమితి కూడా పూర్తి కానుంది. కానీ ఇప్పటికీ ఈ బ్యారేజీల గేట్లు ఎత్తే వారు... దించేవారు కరువ య్యారు. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు నానాహైరానా పడుతున్నారు. రెండేళ్ల నుంచి కాలువలకు నీటి విడుదల చేసే సమయంలో ఇరిగేషన్ సిబ్బందికి ఆ ప్రాజెక్టుల వద్ద విధులు కేటాయించి ఎలాగోలా నెట్టు కొస్తున్నారు. ఒక వేళ భారీ వరద వచ్చి గేట్లు ఎత్తాల్సి వస్తే పరిస్థితి ఏమిటని తీవ్రఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ లేకపోవడంతో నూతనంగా నిర్మిం చిన గేట్లు కిందకు దిగేందుకు, పైకి లేపేందుకు ఇబ్బందిగా మారాయి. నెల్లూరు బ్యారేజీ వద్ద సర్వేపల్లి కెనాల్‌కు నీటిని మళ్లించే మొదటి గేటే పూర్తిగా కిందకు దిగడం లేదు. ఇక్కడ లీకేజీ జరుగుతుండడంతో సర్వేపల్లి కాలువలో పూడిక తీసేందుకు ఇబ్బందిగా మారింది.

రూ.2 కోట్లు లేవట!

గతంలో సంగం, నెల్లూరు ఆనకట్టలు ఉండేవి. ఆ సమయంలో లస్కర్లు ఇక్కడ చెక్కలు ఎత్తేవారు, దించేవారు. అయితే ఇప్పుడు బ్యారేజీలు నిర్మించడంతో గేట్ల ఆపరేషన్‌కు టెక్నికల్ సిబ్బంది అవసరం. ఈ గేట్ల నిర్వహణపై ఇరిగేషన్ అధికారులకు అవగాహన లేకుండా పోయింది. సంగం బ్యారేజీలో 88 గేట్లు, నెల్లూరు బ్యారేజీలో 57 గేట్లు ఉన్నాయి. శిక్షణ పొందిన సిబ్బంది మాత్రమే ఈ బ్యారేజీల నిర్వహణ చేయగలుగుతారు. దీంతో క్షేత్రస్థాయి ఇరిగేషన్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదు. సంగం బ్యారేజీ నిర్వహణకు 28 మంది, నెల్లూరు బ్యారేజీకి 20 మంది అవసరమని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం అనుమతివ్వడం లేదు. మరి టెక్నికల్, నాన్‌టెక్నికల్ సిబ్బంది లేకుండా ప్రాజెక్టులను ఎలా ఆపరేట్ చేయాలని ఇరిగేషన్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. దాదాపు రూ.500 కోట్లతో నిర్మించిన ఈ రెండు బ్యారేజీల ఫలితంగా ఏటా రూ.వేల కోట్ల పంట ఉత్పత్తులు వస్తున్నాయి. అయితే ఏటా రూ.2 కోట్లతో నిర్వహణ చేయలేక పోతుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.



నిబంధనల చట్రంలో 'నీట్'

- నేడు 10 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 2,913 మంది విద్యార్థులు
- కట్టుదిట్టంగా అధికారుల ఏర్పాట్లు

నెల్లూరు(విద్య), మే 3 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం జరిగే జాతీయస్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)కు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పరీక్ష నిర్వహణలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కఠిన నిబంధనలను అమలు చేస్తున్నది. తొలిసారిగా ఈ ఏడాది జిల్లాలోని విద్యార్థులందరికీ నెల్లూరు కేంద్రంగానే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పది కేంద్రాల ఏర్పాటు

నీట్ పరీక్షకు నెల్లూరులో పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి జిల్లావ్యాప్తంగా 2,913 మంది దరఖాస్తు చేశారు. పరీక్షల్లో కాపీయింగ్, పేపర్ లీకేజీ వంటి సంఘటనలకు ఆస్కారం లేకుండా చేసేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. విద్యార్థులంతా నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే.

పరీక్ష కేంద్రాలివే..

నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట పీఎస్ఆర్ ఎంసీహెచ్ స్కూల్, కొత్తూరు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం, దర్గామిట్టలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఏసీ నగర్ ఎంపీఎల్ కార్పొరేషన్ హైస్కూల్, పొదలకూరు రోడ్డులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పప్పులవీధిలోని వైవీఎం నగరపాలక ఉన్నత పాఠశాల, సంతపేట ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రా లను ఏర్పాటు చేశారు. జిల్లా అధికార యంత్రాంగం, ఎన్‌టీఏల పర్యవేక్షణలో జరిగే ఈ పరీక్షకు ఒక్కో కేంద్రానికి ఒక్కో జిల్లా అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించారు.

క్షుణ్ణంగా తనిఖీలు

పరీక్ష హాల్లోకి వచ్చిన విద్యార్థులు వారికి కేటాయించిన సీటులో కూర్చున్న తరువాత ఇన్విజిలేటర్ వచ్చి అడ్మిట్ కార్డులోని వివరాలను పరిశీలించాక క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. వారి వద్ద ఎలాంటి స్లిప్పులు, నిషేధిత సామగ్రి లేవని నిర్ధారించుకున్న తర్వాత 1.45 గంటలకు ఓఎంఆర్ బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తారు. అనంతరం 1.50 గంటలకు గైర్హాజరైన విద్యార్థుల ఓఎంఆర్ షీట్లను స్వాధీనం చేసుకుని 1.55 నిమిషాలకు ఇచ్చిన బుక్‌లెట్‌లపై వివరాలు నమోదు చేయిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు కచ్చితంగా పరీక్ష ప్రారంభమవుతుంది...

అనుమతులు ఇలా...

ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్ష జరగనుంది. 11 గంటల నుంచి విద్యార్థులకుఉ తనిఖీలు ప్రారంభించి, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష హాల్లోకి పంపాక ప్రధాన గేట్లు మూసి వేస్తారు. ఆ తర్వాత వచ్చే విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. పరీక్ష కేంద్రంలోకి వచ్చిన విద్యార్థులకు సూచనలు ఇవ్వడం, ఓఎంఆర్ షీట్ పూర్తిచేయించేందుకు అరగంట సమయాన్ని కేటాయిస్తారు. సాయంత్రం 5 గంటల తర్వాత పరీక్ష రాసిన విద్యార్థులను బయటకు పంపిస్తారు. ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థులకు మాత్రం సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహించి, అనంతరం బయటకు పంపిస్తారు.

ఆంక్షలు కఠినతరం

విద్యార్థుల వస్త్రధారణ, ఆభరణాలపై ఆంక్షలు విధించారు.అన్నీ కేంద్రాల వద్ద పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. పరీక్ష కేంద్రంలోకి అనుమతించే ముందు విద్యార్థులను మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేయనున్నారు. హ్యాండ్‌బ్యాగులు, బెల్టులు, టోపీ, డెబిట్, క్రెడిట్‌కార్డులతో సహా చేతికి గడియారాన్ని సైతం అనుమతించరు. చివరకు వాటర్‌బాటిళ్లను కూడా నిషేధించారు. విద్యార్థినులు చెవులకు రింగులు, చెవిదిద్దులు, ముక్కుపుడక, మెడలో గొలుసులు, నెక్లెస్ వంటి ఆభరణాలతో పాటు జడకు పిన్నులు, క్లిప్స్‌తో కూడా రాకూడదు. లేతరంగు వస్త్రాలే ధరించి రావాలి. పంజాబీ డ్రస్‌లు లేత రంగులోనే ఉండాలి. హాఫ్ హ్యాండ్స్ కలిగి ఉన్న షర్టులు, టాప్‌లే ధరించాలి. షర్ట్‌లకు పెద్ద పెద్ద బటన్‌లతోపాటు స్టిక్కర్‌లు అతికించి ఉండకూడదు. హైహీల్స్ చెప్పులు, బెల్టులు, బూట్లతో వస్తే అనుమతించరు. సాధారణ పాదరక్షలే ధరించాలి. కాగా విద్యార్థులు తమ వెంట అడ్మిట్ కార్డుపై పోస్ట్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు అతికించి, మరొక పాస్‌పోర్టు సైజు, పోస్ట్‌కార్డు సైజ్ ఫొటో వెంట తీసుకురావాలి. పరీక్ష రాసేందుకు పెన్నులను ఆయా కేంద్రాల్లోనే అందచేస్తారు. సమయం తెలిసేలా పరీక్ష హాల్లో గడియారాలను కూడా ఏర్పాటు చేశారు.



అల్లీపురం పీహెచ్‌సీ

అధ్వానం.. అల్లీపురం పీహెచ్‌సీ

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై గ్రేడ్‌ల కేటాయింపు
- 'ఏ' గ్రేడ్‌కు నోచని జిల్లాలోని పీహెచ్‌సీలు
- 'బీ' గ్రేడ్‌లో 11, 'సీ'లో 36, 'డీ'లో 4

నెల్లూరు (వైద్యం) మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీల) పనితీరుపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రతినెలా గ్రేడ్‌లను ప్రకటిస్తుంది. అయితే గత ఆరునెలల నుంచి ఈ గ్రేడ్‌లను ప్రకటించలేదు. ఎన్నికల నేపథ్యంలో వీటిని ప్రకటించలేదు. తాజాగా మార్చి నెలకు సంబంధించి గ్రేడ్‌లను ప్రకటించింది. యథావిధిగా బీ,సీ,డీ గ్రేడ్‌లు తప్ప జిల్లాలోని ఒక్క పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ రాలేదు. దీన్నిబట్టి చూస్తూ పీహెచ్‌సీల పనితీరు ఎలా ఉందో తెలుస్తోంది. మార్చి నెలకు సంబంధించి తాజా వివరాలను ఈ నెల ఒకటిన విడుదల చేసింది. ఇందులో అల్లీపురం పీహెచ్‌సీ తీరు పరమ అధ్వానంగా ఉన్నట్లు తేలింది.

గ్రేడ్‌ల కేటాయింపు ఎలాగంటే..

ఆయా పీహెచ్‌సీకి రోజువారీ ఎంత మంది రోగులు వస్తున్నారు. వారికి అందించే వైద్య పరీక్షలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు, ప్రసవాలు వంటి వాటిని పరిశీలించి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ గ్రేడ్‌లు కేటాయిస్తుంది. అయితే జిల్లాలోని పీహెచ్‌సీల పనితీరుపై వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన ఫలితాలలో అన్నీ కేంద్రాలు చాలా వెనుక బడినట్లు తేలింది. జిల్లాలో 52 పీహెచ్‌సీలు ఉండగా, అందులో అల్లీపురం పీహెచ్‌సీ అసలు ఏ గ్రేడ్‌కు కూడా ఎంపిక కాలేదు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ కేంద్రంలో ప్రజలకు వైద్య సేవలు సరిగ్గా అందటం లేదన్న విషయంపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా కసుమూరు, గుండ్లపాళెం, దగదర్తి తదితర 37 పీహెచ్‌సీల్లో అసలు ప్రసవాలే జరగలేదని గణాంకాలు చెబుతున్నట్లు తేల్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించాలన్న ఉద్దేశంతో జిల్లాకు రూ.25 కోట్లకుపైగా విడుదల చేస్తుంది. ఒక్కో పీహెచ్‌సీలో అత్యవసర మందుల కోసం రూ. 1.75 లక్షల వంతున విడుదల చేస్తుంది. ఇంతఖర్చు చేస్తున్నా ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు.

ఎక్కువ 'సీ'గ్రేడే..

బీ గ్రేడ్‌లో 11 పీహెచ్‌సీలు నిలచాయి. సీ గ్రేడ్‌లో 36, డీ గ్రేడ్‌లో 4 పీహెచ్‌సీలు నిలిచాయి. మొత్తం మీద జిల్లాలోని పీహెచ్‌సీలు 55 శాతం ప్రజలకు మాత్రమే వైద్య సేవలు అందించి నట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ వెల్లడించింది.

మెరుగైన చికిత్సలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. రాష్ట్రంలోనే ఏ గ్రేడ్‌లో నిలిచేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి రోజూ పీహెచ్‌సీల పనితీరును పరిశీలిస్తున్నాం. ఎక్కడ లోపాలు ఉన్నాయో తెలుసుకుని వాటిని సరిదిద్దుతున్నాం.



- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

లేఅవుట్ల అక్రమాలపై మళ్లీ విచారణ

- మున్సిపల్ శాఖ జీవో జారీ
- రేపటి నుంచి పరిశీలన

నెల్లూరు జడ్పీ,మే3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లేఅవుట్ల అక్రమాలు, నుడా అనుమతులిచ్చిన లేఅవుట్లపై మళ్లీ విచారణను మున్సిపల్‌శాఖ చేపట్టనున్నది. ఇందుకు సంబంధించి శనివారం మంత్రి ఆశాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వంలో ఏర్పాటైన అక్రమ లేఅవుట్లను, నుడా అనుమతులిచ్చిన లేఅవుట్లను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రెండు నెలల్లోనే జిల్లాలోని లేఅవుట్లపై విచారణ చేపట్టారు. ఇందులో 230 అక్రమ లేఅవుట్లుగా ఉన్నట్లు అధికారులు లెక్కతేల్చారు. అయినా వాటిపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 230 కంటే ఎక్కువే అక్రమ లేఅవుట్లు ఉన్నాయని, అయితే అప్పటి విచారణ అధికారులు రియల్టర్లతో కుమ్మక్కై తొక్కిపెట్టారనే ఆరోపణ లు వ్యక్తమయ్యాయి. దీంతో మళ్లీ విచారణకు ఆదేశించారు. ఇందుకోసం పురపాలకశాఖ మంత్రి టౌన్‌ప్లానింగ్‌కి చెందిన 14 మంది అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు నుడాకు చెందిన మరో ముగ్గురు కూడా మున్సి పాలిటీలు, పంచాయతీల్లో ఉన్న లేఅవుట్లను స్థానిక అధికారులతో కలిసి సోమవారం నుంచి పరిశీలించనున్నారు.

కుక్కలదాడిలో 14 పొటేళ్ల మృతి

కోవూరు, మే3, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపాళెంలో శనివారం వేకువజామున వీధి కుక్కలు దాడి చేయడంతో 14 పొట్టేళ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన పామర్తి శ్రీనివాసులు పొటేళ్ల పెంపకం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో 50 పొట్టేళ్లను ప్రతిరోజూ పొలానికి తోలుకెళ్లి రాత్రి సమయానికి పాక వద్దకు తోలుకువచ్చేవాడు. ఈ క్రమంలో శ్రీనివాసులు శుక్రవారం రాత్రి కూడా పాకలో పొట్టేళ్లను తోలి జాగ్రత్తలు తీసుకున్నాడు. తెల్లవారి చూసేసరికి వీధి కుక్కలు దాడి చేసి 14 పొట్టేళ్లను హతమార్చడంతో హతాశుడయ్యాడు. పొటేళ్ల మృతితో తనకు రూ.1.50లక్షలు నష్టం వచ్చిందని బాధితుడు వాపోయాడు.



కుక్కల దాడిలో మృతి చెందిన పొట్టేళ్లు

దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు(లీగల్), మే 3(ఆంధ్రజ్యోతి) : జిల్లా యూనిట్‌లోని నెల్లూరు, కోవూరు, ఆత్మకూరు, కావలిలలో ఖాళీగా ఉన్న నాలుగు, రెండవ తరగతి స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పాపిరెడ్డి చెరువులో పాగా

- స్థలాలు ఆక్రమించిన బడాబాబులు
- ఆపై బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం
- విలువ రూ.100 కోట్లకుపైగానే..
- ఆక్రమణదారులకు సీసీ రోడ్ల ఏర్పాటు
- మామూళ్ల మత్తులో అధికారగణం

పాపిరెడ్డి చెరువులో నిర్మించిన ఐదంతస్తుల భవనం



కావలి, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రంకురోడ్డుకు కూతవేటు దూరంలో ఉన్న పాపిరెడ్డి చెరువు లోతట్టు ప్రాంతాలు ఆక్రమణలకు గురయ్యాయి. అక్కడ స్థలాలు ఆక్రమించినవారు పేదవారనుకుంటే పొరపాటే. అంతా బడాబాబులే. ఇక్కడ అంకణం విలువ రూ.3 లక్షలకు పైగానే ఉంటుంది. 30 అంకణాలు ఆక్రమిస్తే దాని విలువ రూ. కోటి ఉంటుంది. బడాబాబులు ఒక్కొక్కరు రెండు,మూడు ప్లాట్లు ఆక్రమించుకున్నారు. అంతేకాక అధికారులకు మామూళ్లు ఇచ్చి పెద్ద పెద్ద భవంతులు కూడా నిర్మించి అద్దెలకు కూడా ఇచ్చారు. ఒక వ్యక్తి అయితే ఏకంగా ఐదు అంతస్తులు నిర్మిస్తున్నా అడిగేవారు లేరు. అయితే చెరువులో ఆక్రమంగా నిర్మించే ఇళ్లకు మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులు ఇస్తున్నారో..ఎవరికీ అర్థం కావడం లేదు.

హద్దులు నిర్ణయించినా ఆక్రమణలు

పదేళ్ల కిందట పాపిరెడ్డి చెరువును సర్వే చేసి హద్దులు నిర్ణయించి, రాళ్లు పాతారు. అప్పటికే చెరువులోతట్టు ప్రాంతంలో పెద్ద పెద్ద భవనాలు వెలిశాయి. అయితే వారంతా బడాబాబులు కావటంతో వాటిని తొలగించకుండా అధికారులు కాలయాపన చేశారు. కొంతమంది భవనాలు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో అధికారులు తొలగిస్తారేమోనని వారు కోర్టును ఆశ్రయించారు. వీటిని ఆసరా చేసుకుని చెరువు లోతట్టు ప్రాంతంలోకి ప్రతిఏటా కొంతమంది జొరబడి పోతున్నారు. కబ్జాదారులంతా ఏపార్టీ అధికారంలో ఉంటే వారికి మద్దతుగా నిలుస్తుండటంతో ఆక్రమణల తొలగింపుపై అధికారులపై ఒత్తిడి చేసే వారు లేకుండాపోయారు. దీంతో ఒకరిని చూసి మరొకరు చెరువును ఆక్రమించుకున్నారు. అయితే అధికారులు మామూళ్ల మత్తులో వాటి గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రూ. వందకోట్లకుపైగానే స్థలాల ఆక్రమణ

పాపిరెడ్డి చెరువు లోతట్టు ప్రాంతంలో భవనాలు నిర్మించిన స్థలాల విలువ లెక్కడితే రూ.100 కోట్లకు పైనే ఉన్నట్లు తెలుస్తోంది. బడాబాబులు భవంతుల నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎవరికివారు తమకెందుకులే అని పట్టించుకోవడంలేదు. సాధారణంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలంటే మున్సిపల్ అధికారులు సవాలక్ష నిబంధనలు పెడుతుంటారు. అయితే చెరువులో స్థలాలకు ఎలా అనుమతులు ఇచ్చారో అర్థం కావటం లేదు. ఆక్రమణదారులు కొందరు పదవీవిరమణ చేసిన, చనిపోయిన తహసీల్దార్ల పేరు మీద డీ.ఫారం పట్టా చూపిస్తుండగా, మరి కొందరు సర్వే నంబర్లు మార్చి దొంగ రిజిష్టర్లు చేసుకున్నారు. అది చెరువు లోతట్టు ప్రాంతమని అన్నీ శాఖల అధికారులకు తెలిసినా, తమ మామూళ్లు తమకు వస్తే చాలన్నట్లు వారు పట్టించుకోవటంలేదనే ఆరోపణలు ఉన్నాయి. కచ్చా రోడ్లు కూడా లేని ప్రాంతాలు పట్టణంలో కోకొల్లలు. అయితే చెరువు ఆక్రమణ ప్రాంతంలో బడాబాబులకోసం సీసీ రోడ్లు నిర్మించారంటే అధికారులు, పాలకులు ఎంతకైనా తెగిస్తున్నట్లు అర్థమవుతోంది. వాస్తవంగా నీటి వనరులకు చెందిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా, అక్కడ నిర్మాణాలు జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాపిరెడ్డి చెరువును మళ్లీ సర్వే చేసి, ఆక్రమణలను తొలగించాల్సి ఉంది.



భవనవాసుల కోసం చెరువులో వేసిన సీసీ రోడ్డు

మున్సిపల్ అధికారులే అడ్డుకోవాలి

పాపిరెడ్డి చెరువులోతట్టు ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలను మున్సిపల్ అధికారులే అడ్డుకోవాలి. ప్రస్తుతం ఎక్కడైనా కొత్తగా నిర్మా ణాలు చేపడుతున్న విషయం తమ దృష్టికి తెస్తే వాటిని అడ్డుకుంటాం

- పీఎం ఖాన్, జలవనరుల శాఖ ఇన్‌చార్జి ఈఈ

గత ప్రభుత్వంలో అనుమతులు ఇచ్చారు..

పాపిరెడ్డి చెరువులో అక్రమ నిర్మాణాలకు తాము అనుమతులు ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో అనుమతులు ఇచ్చినట్లుగా ఉన్నారు. తాజాగా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే మాత్రం అడ్డుకుంటాం. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన భవనాల అనుమతులను పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

- వివేకానంద్, టీపీవో

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	129
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 470

బంగారం, వెండి ధరలు
బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 9018
వెండి కిలో ధర	రూ. 96,100
వెండి ఒక గ్రాము	రూ. 99.10

బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవు : ఎంపీడీవో

లింగసముద్రం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ కె శ్రీనివాసులు సిబ్బందిని హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని ఆర్ఆర్ పాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, టీఏ మహేంద్ర, ఎఫ్ఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

260 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 343పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 260బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-56, ఆర్ఆర్-9, సీఆర్-18 కారణాలతో 83బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.254.97గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి ఇసాక్ స్వరన్‌దత్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

● మంత్రి సత్యకుమార్‌కి బీజేపీ నేతల వినతి

కలిగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ స్టేట్ కౌన్సిలర్ నందనవనం ప్రభాకరరావు స్థానిక నేతలతో కలిసి శనివారం వినతిపత్రాలు అందజేశారు. వింజమూరులో డయాలసిస్ కేంద్ర ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రిని కలిసి కలిగిరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని అసౌకర్యాలను వివరించారు. వారి వెంట మండల కూటమి నాయకులు ఉన్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠకు ఆహ్వానం

కావలి, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ పునఃప్రతిష్ఠ ఈ నెల 18న శృంగేరి పీఠాధిపతుల చేతుల మీదుగా జరుగనుందని ఆలయ కమిటీ కోశాధికారి రోశయ్య, ఉపకోశాధికారి అమరా వేదగిరిలు తెలిపారు. ఈ విషయంపై శనివారం వారు పట్టణంలోని పలువురికి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఆలయ నిర్మాణానికి నగదు రూపేణా.. వస్తు రూపేణా ఆర్థికసహాయం అందచేసిన వారికి తొలుత ఇంటింటికి వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

వైభవంగా కలశ మహోత్సవం

లింగసముద్రం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల గ్రామంలో దత్తాత్రేయస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా శనివారం కలశ మహోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం దత్తాత్రేయస్వామి మాలధారణ చేసిన స్వాములు గ్రామంలోని కోదండరామస్వామి ఆలయం వద్ద కలశాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ట్రాక్టర్‌లో గ్రామంలో ఊరేగించారు. గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్సైలు ఎం నారాయణ, వెంకట్రావు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కోన బ్రహ్మోత్సవ కమిటీ సభ్యుడిగా కిన్నెర



కిన్నెర నరసింహరావును అభినందిస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యునిగా ఆత్మకూరు పట్టణానికి చెందిన కిన్నెర నరసింహారావు నియమితులయ్యారు. కాగా, బ్రహ్మోత్సవ కమిటీ సభ్యునిగా ఎంపికచేసిన రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, సహకరించిన పట్టణ టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, జిల్లా తెలుగు యువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సిద్దీపురంలో మెగా రక్తదాన శిబిరం

సంగం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురంలో యువనేస్తం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన యువనేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు ఏటా మే నెలలో రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

అనంతసాగరం, మే 3 (ఆంధ్రజ్యోతి): సోమశిల గిరిజన గురు కుల బాలుర పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 9441852191 నెంబరును సంప్రదించాలని కోరారు.

మాలకొండలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

● ఎమ్మెల్యే నాగేశ్వరరావు



మాలకొండలో దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. శనివారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాగణంలోని మహా అన్నదానం, కేశ ఖండన శాల, లడ్డుప్రసాదం కౌంటర్, దుకాణాలు, కోనేరు తదితర ప్రాంతాలను పరిశీలించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని భక్తులకు తాగునీరు, ఇతర వసతులు కల్పించాలని ఆలయ అధికారులకు ఆయన సూచించారు. ఆలయంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. భక్తులకు నాణ్యమైన లడు ప్రసాదం, రుచి శుచికరమైన భోజనం అందించాలని తెలిపారు. దాతలను ప్రోత్సహించి ఆలయంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ఆధ్యాత్మిక శోభ సంతరించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఈ నెల 17వ తేదీన జరగనున్న లక్ష్మీనరసింహస్వామి జయంతి గోడపత్రికను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేను పలువురు భక్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవి సాగర్‌బాబు, కందుకూరు రూరల్ ఎస్ఐ బాలమహేంద్ర నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు మన్నం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దశదినఖర్మకు ఎమ్మెల్యే హాజరు

మండలంలోని శాఖవరంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన వడ్లమూడి వరమ్మ దశదిన ఖర్మకు ఎమ్మెల్యే ఇంటూరి హాజరై ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకట్రావు, కందుకూరు పట్టణ టిడిపి మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని శాఖవరంలో గ్రామ సచివాలయాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, మూమెంట్ రిజిస్టరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు.

ఫిజియోథెరపీపై అవగాహన

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీతో మానసిక వత్తిళ్లు దూరం అవుతాయని డాక్టర్ రమేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నరేంద్రదేవ్ అధ్యక్షతన ఫిజియోథెరపీపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రామదూత ఆశ్రమ భూములను స్వాధీనం చేసుకోవాలి

● హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె

కందుకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారికి పక్కనే చెరువుపోరంబోకు భూమి, అటవీ భూములలో రామదూత స్వామి నిర్మించిన ఆశ్రమంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేసి తక్షణం భూములను స్వాధీనం చేసుకోవాలని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవాలని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని నాలుగేళ్లక్రితం ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషారాణి ఆదేశాలు జారీచేయగా ఆ ఉత్తర్వులను అమలుచేయకపోగా ఉన్నతాధికారులను తప్పుదారిపట్టించేలా కిందిస్థాయి అధికారులు నివేదికలు ఇస్తుండటం శోచనీయమన్నారు. తక్షణం ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు అమలు చేయాలని కోరుతూ శనివారం సబ్ కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఆక్రమణల తొలగింపుపై స్టేకి వెళ్లలేదు : మాదాల

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు సర్కిల్ అభివృద్ధి కోసం చేపట్టిన ఆక్రమణల తొలగింపును సవాల్‌చేస్తూ కోర్టులో స్టేకోసం తాను వెళ్లలేదని స్థానికుడైన మాదాల రవీంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేరే వ్యక్తులు కోర్టుకు వెళ్లి స్టేతెచ్చారని, కొందరు కావాలని తనపేరును జతచేశారని, తనకు, స్టే ఉత్తర్వులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. నిబంధనల మేరకు సర్కిల్ అభివృద్ధికి అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

వింజమూరులో డయాలసిస్ కేంద్రం ప్రారంభం



వింజమూరులో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో డయాలసిస్ కేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి మాట పక్కన పెడితే, ప్రజల ప్రాణాలను మాత్రం జగన్మోహన్‌రెడ్డి హరించారని దుయ్యబట్టారు. జగన్ అమ్మిన మద్యం తాగి కిడ్నీ వ్యాధిగ్రస్థులు పెరిగారని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా క్యాన్సర్ బాధితులు కూడా పెరుగుతున్నారని, వారిని మొదటి దశలోనే గుర్తించడానికి ఇప్పటికే మూడు కోట్ల మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం మంత్రిని, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, కొమ్మి లక్ష్మణ్‌నాయుడు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సుజాత, సర్పంచి సృజన, ఎంపీపీ ఈ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు వినతి

కావలి : స్థానిక ఏరియా వైద్యశాలలో డయాలసిస్ సెంటర్, ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని పలువురు పట్టణవాసులు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. శుక్రవారం రాత్రి ఆయన కావలికి చేరుకోగా, బీజేపీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక పోలీస్ కమాండ్ కంట్రోల్ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకున్నారు. శనివారం ఉదయాన్నే ఆయన బీజేపీ నేతలతో కలిసి ట్రంకురోడ్డులో టీ తాగారు. స్థానికులతో కొంతసేపు మాట్లాడారు. అనంతరం వింజమూరుకి బయలుదేరారు. ఆ సమయంలో డీఎంహెచ్‌వో సుజాత, డీసీహెచ్‌వో మునిక్రిష్ణ, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల తదితర మంత్రికి పుష్పగుచ్ఛం అందచేసి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కావలి వాసవీ మాత ఆలయ కమిటీ వారు మంత్రిని కలిసి ఆలయ పునరుద్ధరణ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీ. వంశీధర్‌రెడ్డి, నేతలు కందుకూరి వెంకటసత్యనారాయణ, జీ భరత్‌కుమార్, కంచర్ల మురళీధర్ నాయుడు, సీవీసీ సత్యం, కే. బ్రహ్మానందం, మందా కిరణ్‌కుమార్, అమరా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ఫీజు గడువు పొడిగింపు

కొండాపురం, మే3(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫీజు దరఖాస్తు గడువు ఈ నెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీహరి శనివారం ఒక ప్రకట నలో తెలిపారు. ఫీజు చెల్లింపునకు ఏప్రిల్ 30తో గడువు ముగిసినా కొందరు విద్యార్థులు చెల్లించ లేదన్న సమాచారంతో ప్రభు త్వం ఫీజు చెల్లింపు నకు గడువు పొడిగించింద న్నారు. ప్రథమ సంవత్సరం (ఆర్ట్స్, సైన్స్) విద్యార్థులు రూ.600, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆర్ట్స్ విద్యార్థులు రూ.600, సైన్స్ విద్యార్థులు రూ.875 ఆన్‌లైన్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

మాలకొండ ఆదాయం రూ. 11,79,689

వలేటివారిపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 11,79,689 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవి సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 6 వేలు, కుంకుమార్చన ద్వారా రూ. 20,840, వివాహముల ద్వారా రూ. 6 వేలు, తలనీలాలు ద్వారా రూ. 72,375, వాహన పూజలు ద్వారా రూ. 3,040, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 4,35,200, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 680, రూంఅద్దెలు ద్వారా రూ. 35,330, కవర్లు ద్వారా రూ. 8,700, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,47,390, అన్నదానం ద్వారా రూ. 3,30,518, విరాళముల ద్వారా రూ. 13,616 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు తెలియజేశారు.

బాలబాలికల బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో శనివారం జరిగింది. క్రీడా కారులను జిల్లా జట్లకు ఎంపికచేసినట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ తొట్టెంపూడి సుబ్బారావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు పామూరులోని సెయింట్ మార్క్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తామని, మే 15నుంచి 18వరకు చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో ముప్పవరపు జయకుమార్, సయ్యద్ జిలానీబాషా, ఇతర పీడీలు పాల్గొన్నారు.

ఇండోసోల్‌కు వేల ఎకరాలు కట్టబెట్టాలనుకోవటం శోచనీయం

● ఆమ్ ఆద్మీ పార్టీ నేత నేతి మహేశ్వరరావు

కందుకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ కోసం ఉలవపాడు మండలం కరేడులో వేల ఎకరాలు కట్టబెట్టాలని ప్రభుత్వం యోచిస్తుండటం శోచనీయమని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కోఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కరేడులో ఎంతో విలువైన రెండు పంటలు పండే భూములు, పండ్లతోటలు, ఆకుతోటలు ఉన్నాయని, అలాంటిచోట ఇండోసోల్‌కు భూకేటాయింపులకు ప్రభుత్వం జీఓ ఇవ్వటం ఆక్షేపణీయమన్నారు. తక్షణం ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజరు బదిలీ



మేనేజరును సత్కరిస్తున్న సిబ్బంది

అల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజరు టి.దర్శన్‌కుమార్‌ను శనివారం బదిలీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. అల్లూరులో శాఖ ఏర్పాటైన నాటినుంచి నేటి వరకు ఆయన విధులు నిర్వహించి అల్లూరు శాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని బ్యాంకు సిబ్బంది కొనియాడారు. కార్యక్రమంలో క్యాషియర్ సుజాత, డిప్యూటీ మేనేజరు ఆంజనేయులు, సిబ్బంది కమల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి సహకరించాలి

● రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ నేతల వినతి

ఆత్మకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, జిల్లా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కటరంపాటి సుధాకర్ కోరారు. శనివారం మంత్రి సత్యకుమార్ వింజమూరు పర్యటన సందర్భంగా వారు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయరెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులు వివరించి, అందుకు తమవంతు సహకారం అందించాలని కోరారు. అదేక్రమంలో ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలను 150 పడకల వైద్యశాలగా తీర్చిదిద్దాలని కోరారు. వైద్యుల కొరత ఉందని వివరించారు. అందుకు మంత్రి సత్యకుమార్ సానుకూలంగా స్పందించారు. ఆనం రామనారాయణరెడ్డి ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నారని వైద్యశాలను తప్పక అభివృద్ధి చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పొన్నూరు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలి

●ఉదయగిరి: ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేసి అభివృద్ధి చేయాలని శనివారం వింజమూరుకు విచ్చేసిన రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తోపాటు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లకు టీడీపీ, బీజేపీ నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షులు సందిరెడ్డి రామారావు, సురేష్‌రెడ్డిలు వినతిపత్రం అందజేశారు. అలాగే నియోజకవర్గంలో న్యాయవాదులకు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని కోరినట్లు వారు తెలిపారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేను సన్మానించారు.

ఉదయం ఉలుకూపలుకూ లేకుండా..

● సాయంత్రం పాడె ఎక్కించేటపుడు స్పృహలోకి..
● నీరు, పాలు తాగించడంతో కాసేపటికే మృతి
● కొండయ్యగారిపాలెంలో ఘటన



శేషమ్మ (ఫైల్)

కావలి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండయ్యగారిపాలెంకు చెందిన ఉప్పాల శేషమ్మ (70) అంత్యక్రియల్లో వింత అనుభవం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం మేరకు వివరాలు... శేషమ్మ మూడునెలల కిందట అల్లూరు మండలం రామన్నపాలెంలో ఉంటున్న చెల్లెలు వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఉలుకూపలుకూ లేకుండా అపస్మారక స్థితిలోకి వెళ్లింది.దీంతో ఆమె మృతి చెందిందని చెల్లెలి కుటుంబసభ్యులు భావించి ఆమెను అంబులెన్స్‌లో కొండయ్యగారిపాలెంలోని కుమారుడు వెంకటేశ్వర్లు ఇంటికి ఉదయం 11గంటలకు తీసుకొచ్చారు. సాయంత్రం 4గంటల వరకు చాపపై పడుకోబెట్టారు. అంత్యక్రియల కోసమని వివిధ గ్రామాల నుంచి బంధువులను పిలిపించడంతో వారు ఏడుపులతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాణసంచా కాల్చి పాడె ఎక్కించే సమయంలో ఆమెలో కదలికలు కనిపించడంతో అక్కడున్నవారంతా ఒకింత విస్మయానికి గురయ్యారు. బంధువులంతా ఆమెకు తిరిగి ప్రాణమొచ్చిందని ఆనందపడ్డారు. కొంతసేపు కూర్చోబెట్టి మంచి నీళ్లు, పాలు తాపించి కావలికి తీసుకొచ్చేందుకు 108 వాహనాన్ని పిలిచారు. వారు వచ్చి ఆమె పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మళ్లీ విషాదంలో మునిగిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చేసేదిలేక మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



అనంతసాగరం: ప్రత్యేక అలంకారంలో సీతారామ లక్ష్మణస్వామి

అనంతసాగరం మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవనగరంలో ఉన్న కోదండ రాముని ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఘనంగా ఊరేగించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా వసంతోత్సవం

ఉదయగిరి: మండలంలోని జీ.చెర్లోపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు శనివారం వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం వసంతోత్సవం, పారువేట నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖుల రాక

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న అంకాళమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక ఉత్సవాలకు ఆదివారం దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ శాసన సభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అలాగే గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్‌ప్లాంటును ప్రారంభించడంతోపాటు ధర్మవరం గ్రామంలో పర్యటిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలి

సీతారామపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డిప్యూటీ ఎంపీడీవో భార్గవి సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్తున్నారా, లేదా అని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా భార్గవి మాట్లాడుతూ ఇంటిలోని తడిచెత్త, పొడిచెత్త గ్రీన్ అంబాసిడర్‌లకు అందచేయాలన్నారు.

సచివాలయానికి వాటర్ కూలర్ వితరణ

సంగం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి సచివాలయానికి పడమటిపాళెం నీటిసంఘం ఉపాధ్యక్షుడు మద్రి సందీప్ యాదవ్ వాటర్ కూలర్‌ను శనివారం బహూకరించారు. సచివాలయానికి వచ్చే ప్రజలతోపాటు సిబ్బందికి చల్లటి తాగునీటి కోసం తన సొంత నిధులు వెచ్చించి అందచేశారు.

ధ్యానంపై విద్యార్థులకు శిక్షణ



ధ్యానంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మురళి

అనంతసాగరం మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథా లయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థు లకు ధ్యానంపై సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ బీ మురళి శిక్షణ ఇచ్చారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతిరోజు మెడిటేషన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు నారాయణరావు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

అనంతసాగరం మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని శనివారం డీఎల్‌పీవో నయీమ్‌తాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రతేక శ్రద్ధ చూపాలని, తాగునీరు, పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలి



కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఈ గౌస్‌మొహిద్దీన్

సంగం, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్తాపురంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న పక్కాగృహ నిర్మాణాలను గృహనిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ గౌస్‌మొహిద్దీన్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు నిర్మాణాలు చేపడితే అవసరమైన సిమెంట్, ఇనుము సరఫరా చేస్తున్నామన్నారు. అంతేగాకుండా బిల్లులు కూడా వెంటనే మంజూరవుతున్నాయన్నారు. పనులు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వర్క్‌ఇన్‌స్పెక్టర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పుట్టిన ప్రతి బిడ్డకు ఆధార్ కార్డు తప్పనిసరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో భార్గవి

సీతారామపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రతి బిడ్డకు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో భార్గవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన శనివారం మహిళా పోలీసులకు, అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పుట్టిన ప్రతి బిడ్డకు ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయిం చిందని, ఇందులో భాగంగా మండల పరిధిలో పుట్టిన పిల్లలకు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఉందా, లేదా అనే వివరాలు తెలుసుకొని యాప్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు.

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

మర్రిపాడు, మే 3 (ఆంధ్రజ్యోతి): పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.